రామాయణం

# సుందరకాండ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని గీతా దీక్ష వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) గీతా దీక్ష వారి వెబ్ సైట్: http://geetadeeksha.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో గీతా దీక్ష వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## గీతా దీక్ష వారి వెబ్ సైట్:

## http://www.geetadeeksha.com



# అతి విశిష్టం ఈ దానం!



"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ సీతారామాభ్యాం నమ:



# శ్రీ గోస్వామి తులసీదాసు కృత
# శ్రీరామ చరిత మానసము నందలి
# సుందర కాండము


తెలుగు పద్య రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.



## సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు


Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,

Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/

శుభమస్తు　　　　అవిఘ్నమస్తు

శ్రీ సీతారామాభ్యాం నమః



శ్రీ గోస్వామి తులసీదాసు కృత

శ్రీరామ చరిత మానసము నందలి

# సుందర కాండము

తెలుగు పద్య రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.

## అంకితం

నా తల్లిదండ్రులు

**అమరవాది రామకృష్ణయ్య**

**సుబ్బమ్మ**

గార్ల

దివ్య స్మృతికి

ఆ॥ జన్మనిత్తురిలను జననియు జనకుండు
వెతలకోర్చి మనల పెద్దజేయు
విద్యబుద్ధులిచ్చి పెండ్లిచేసినవారి
ఎట్లు ఋణము దీరు ఇట్లుగాక

## ఉపోద్ఘాతము

సంస్కృతములో వాల్మీకి రామాయణమును మించిన కావ్యము లేదు. కఠిన పద భూయిష్టమయిన ఆ రామాయణ మును విద్యాసుగంధ పరితప్తులే ఆఘ్రాణించ గలరు. పామరులకు రామకథ దూరము కావలసినదేనా? వారు రామ కథామృతమును గ్రోల అనర్హులా? అని తలచి కారణ జన్ముడు శ్రీ గోస్వామి తులసీదాసు సాక్షాత్ ఆ పరమేశ్వరుని ఆజ్ఞచే శ్రీమద్రామాయణమును ప్రజల భాషయగు అవధి (హిందీ ప్రాకృతము) లో రచించారు.

కొన్ని కోట్లమంది అది చదివి ధన్యులయ్యారు. అదే శ్రీరామచరిత మానసము. నిజానికి ఉత్తర భారత దేశమున వాల్మీకి రామాయణముకన్న శ్రీరామచరితమానసముకే పాఠకులు శ్రోతలు అధికము.

చివరకు దక్షిణ భారతమున కూడా అది ఎన్నో సార్లు ఎంతో మందితో అనువదింపబడి ఎంతో ప్రసిద్ధి నొందినది. ఒక గొప్ప భక్తుని హృదయాంతరాళాల్లోనుంచి పెల్లుబికిన భక్తితరంగమే ఈ రామచరితమానసము. భక్తి పరాకాష్ఠతో తులసీదాసు వాల్మీకి రామాయణమును తన మనసుకు నచ్చిన విధంగా వేరే ఇంకో మూసలో పోసి తన స్వంత పాకంతో మధురమైన పాకం తయారు చేశారు. ఈ పవిత్ర కావ్యమును శ్రీ తులసీదాసు వారణాసిలో శ్రీ విశ్వనాథుని మందిరమున నుంచగా స్వయముగా శ్రీ విశ్వనాథుడే "**సత్యం శివం సుందరం**"

అని వ్రాసి చేవ్రాలు చేసెనని లోక ప్రసిద్ధ వాక్యము. దీనిని చదువు వారు ధన్యులు.

ప్రాకృత భాషలోని మాధుర్యము అద్భుతము, సులభము సుందరము అయిన ఉపమాలంకారములతో అడుగడుగునా రామ చరిత మానసము పాఠకుల మనసు దోచుకుంటుంది.

ఇకపోతే వాల్మీకి రామాయణం ఇష్టపడే కొంతమంది దక్షిణాది వారికి రామచరితమానసం అంత నచ్చదు. కారణం ఇందులో మూలకథలో తులసీదాసు చేసిన మార్పులు.

భక్తి పారవశ్యంతో రాముని భగవంతునిగా భావించి ప్రతి పాత్రా రాముని పొగడినట్లు రాముడు కూడా తనే భగవంతుడనని మాట్లాడినట్లూ వ్రాస్తాడు తులసీదాసు. వాల్మీకి రామాయణంలో రాముడు కేవలం ఒక సుగుణాల ప్రోగయిన రాజకుమారుడు. మానవ మాత్రుడు. అదే తేడా.

భావావేశంతో ఉత్తరాదివారికి దక్షిణాదివారికీ ఉన్న తేడా ఇంకొకటుంది. ఇందులో రాముడు తన భక్తులందరినీ ప్రేమగా కౌగలించుకుంటాడు. అది ఉత్తరాది వారి సంప్రదాయం. కానీ వాల్మీకి రామాయణంలో ఇది ఉండదు. అందువల్ల కూడా రామచరిత మానసం కొంతమంది విమర్శకు గురి అయింది.

ఇక సుందర కాండ గురించి తీసుకుంటే కథలో చాలా మార్పులుంటాయి. హనుమ విభీషణుణ్ణి కలవటం, మండోదరి వేగులను పంపించడం మొదలయినవి.

రామాయణం కథ శివుడు పార్వతికి చెపుతుంటాడని కాకభుశుండు గరుత్మంతునికి చెపుతుంటాడు. కథ మధ్యలో ఆ పాత్రలు వచ్చి అవి మాట్లాడటం వల్ల శివుని సంభాషణలు కాకభుశుని సంభాషణలూ కలగాపులగం అవుతాయి.

ఒక పాత్ర మాట్లాడాక కొంత కథ జరిగి ఇంకోపాత్ర మధ్యలో మాట్లాడుతుంటుంది. కొంత సంభాషణ నేరుగా ఉంటుంది. కొంత అన్యాపదేశంగా నీతి సూచకంగా ఉంటుంది. ఇది కొంత తికమక కలుగచేస్తుంది.

ఇదే అయోమయం అనువాదం పద్యరూపం అవటం వల్ల అది ఎక్కువ అవుతుంది. ప్రతిదానికి అనగ అని చెప్పాల్సి రావటం కుదరక ఏ పాత్ర ఏ మాట అంటుందో తెలియని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. తులసీదాసు రచనా పద్ధతిలో వైవిధ్యమే అది. దానికి నేను చేయగలిగిందేమీ లేదు. ప్రాస సౌలభ్యానికి కొన్ని చోట్ల అర్థం మారి ఇంకా కథలో తికమక వచ్చి ఉండవచ్చు. అందుకే ప్రతి పద్యం తర్వాత వచనంలో ఆ లోపాలు సరి దిద్దుకునే ప్రయత్నం నా శాయశక్తులా చేశాను.

రామచరితమానస పంచమ సోపానం సుందర కాండము. ఇందులో 60 చౌపాయిలు దోహాలున్నాయి. చౌపాయి అనగా 4 అంతకు మించిన పాదాలుండే కవిత. దోహాలో రెండు పాదాలుంటాయి. నేను దోహాలను తేటగీతి పద్యాలుగా, చౌపాయీలను సీసపద్యాలుగా వ్రాశాను. సీస పద్యాలుగా వ్రాయటానికి కారణం ప్రాస సౌలభ్యం ఇంద్ర గణాలను మన ఇష్టం వచ్చినట్లు దాదాపు వచనమంత తేలిక భాషలో వ్రాయవచ్చు. అదే వృత్త పద్యాలయితే యతికోసం మూలంలో లేని పదాలను వాడవలసి ఉంటుంది.

నా ఉద్దేశ్యమే హిందీ రానివారు తేలికగా సుందరకాండ చదువుకోవటం. అందుకనే సీస పద్యాలలో సాధ్యమైనంత తేలిక భాషలో వ్రాశాను. కొన్ని చోట్ల ప్రాసకోసం తప్పితే చాలాచోట్ల మనం మాట్లాడుకునే భాష వ్రాయటం వలన చదువుకోవటానికే కాక పద్యరూపంగా పాడుకోవటానికి కూడా తేలికగా వుంటుందని నా ఆలోచన.

అలాగే వచనాలు కూడా ఇంకా ఎక్కువ భావానందం కలగడానికి వాడాను. ఇది వ్రాయటానికి కారణం నా కవిత్వం గొప్ప చూపించుకోవటం కాదని నా మనవి. అసలు నేను కవినే కాదు. ఆ భగవానుడే నాచేత ఇవన్నీ పలికించాడు. అలాగనని పోతనగారిలా గొప్పలు పోతున్నానని దయచేసి భావించవద్దు.

ఇకపోతే రామచరిత మానసములోని పంచమ సోపానం అయిన సుందర కాండ గొప్పతనం పరిశీలిద్దాం.

ఇది ఒక భక్తి కావ్యం. ప్రతి పాత్రా భక్తుడే. ప్రతి పాత్రా భక్తిలో కరిగిపోతూ వేయినోళ్ల భగవానుని కీర్తిస్తుంటుంది. అది చదువుతున్న వారూ అదే చేయుట వలన చదువుతూనే భగవన్నామ స్మరణ వేలసార్లు చేసి ఆ పుణ్యం అనుకోకుండానే పొందుతారు. అదీ ఈ రచన విశిష్టత. కన్నులు అశ్రుపూరితాలవుతాయి.

సీత హనుమంతుడితో ప్రభువు నన్ను ఏల మరిచాడు నా తప్పేమిటి. నా తప్పు ప్రభు వియోగంతో చనిపోక పోవటమే. కానీ ప్రభువుని చూడాలని మనస్సు పరితపించి అడ్డు రావటం వల్ల ఆ చావుకూడా నా దరికి రావడం లేదు అని చెప్పినప్పుడు కన్నీరు కార్చని చదువరి వుండడు. నామట్టుకు నేను ఆ భావంతో చాలాసేపు కన్నీరు కార్చాను. మొదటిసారి చదివినప్పడే కాదు. ప్రతిసారీ. అదే నన్ను సుందరకాండ తెలుగు చేయటానికి పురికొల్పింది. నాలాగే మీరందరూ అలాగే భావావేశం పొందాలని నా కోర్కె.

అలాగే విభీషణుడు తనని తాను కించపరచుకోడానికి ఏమాత్రం వెనుదీయడు. నేను రాక్షసుణ్ణి తామసుణ్ణి అయినా నన్ను కరుణించు శరణు పాహి పాహి అంటాడు. ఎంత భక్తి చూడండి.

రామాయణంలో అన్నదమ్ములెలా ఉండాలో అతి ఉత్తమంగా చెప్పారు వాల్మీకి. భరతుడిలాంటి తమ్ముడు ఉన్న అన్నలు ఇక దేనికీ విచార పడక్కరలేదు.

అలాగే తులసీదాసు కృతిలో విభీషణుడు ఎన్నో విధాల రావణుడికి నచ్చచెప్పాడు సీతని తిరిగి ఇచ్చి రాముడి శరణు వేడమని. కాలితో తన్ను కూడా తింటాడు. చివరికి అతనిని వదిలి రాముని శరణంటాడు. ఎంతో ఉదాత్తంగా చిత్రీకరించిన భక్తుని పాత్ర విభీషణునిది.

అలాగే హనుమంతుడు. నేను చంచలమైన కపిని, నన్నే తన దాసునిగా అంగీకరించిన రాముడు నిజంగా శరణాగత త్రాత. భయపడకు అని విభీషణుని ప్రోత్సహించి రాముని శరణు కోరేట్లు చేస్తాడు.

ప్రతి చోట హనుమ బుద్ధి తెలివి తేటలు ప్రస్ఫుటం అవుతుంటాయి బుద్ధి మతాం వరిష్ఠం. రావణుని సభలో హనుమ నీతి బోధ ఎంత మధురంగా వుంటుందంటే చదివినదే ఇంకా ఇంకా చదవాలనిపిస్తుంది. వినాశకాలే విపరీతబుద్ధి అని ఎంత చెప్పినా ఆ మూఢుడు రావణుడు వినడు. చావు సమీపించినవాడు ఎలా మంచి మార్గాన ఉంటాడు.

ఇకపోతే ప్రతి చౌపాయీ లోనూ ఎన్నో ఉపమాలం కారాలతో అద్భుతంగా ఉంటుంది తులసీదాసు రచన. మంచి పాత్రలే కాదు. దుష్ట పాత్రలు కూడా చక్కటి ఉపమాలంకారాలతో మాట్లాడడం ఈ రచన గొప్పతనం. తిరగలిలో నలిగిన శనగలతో పాటు వాటికున్న పురుగులు కూడా చస్తాయి. అలాగే కపులతో

పాటు చేరిన ఆ మూర్ఖుడు విభీషణుడు కూడా చస్తాడని అంటాడు రావణుడు. ఎంత గొప్ప పోలిక చూడండి.

అలాగే సీత త్రిజటతో మాట్లాడటం, రామునికి సీత ఇచ్చే సందేశం, విభీషణుడు హనుమతో మాట్లాడటం ఇలా అన్ని చోట్ల అద్భుతమైన ఉపమాలంకారాలతో సుందరకాండ అద్భుతంగా వుంటుంది.

హనుమంతుడు ఇదివరకు సీతను చూడలేదు. ఆమెను రావణుడు చంపివేశాడో లేదో తెలియదు, బలవంతంగా వివాహం చేసుకున్నాడో లేదో తెలియదు. ఎక్కడ ఉందో తెలియదు. అలాంటి సమయంలో ఒక్క రాత్రిలో ఆమెను ఎలా చూడగలిగాడు అనే భావనతో ఆయన విభీషణుడిని కలిసినట్లు వ్రాశాడు. పైగా విభీషణుడిని హనుమ తమలో ఎలా కలవనిచ్చాడు. ఆయన రామ భక్తుడని గ్రహించే కదా? అందుకనే విభీషణ హనుమల సమాగమం వ్రాశాడు తులసీదాసు.

అలాగే ప్రతిసారీ పరమ శివుడు పార్వతితో రాముని పొగుడుతూ నీతి వాక్యములు చెపుతుంటాడు. ఇది వాల్మీకి రామాయణంలో ఉండదు.

దీని అంతరార్థం ఏమిటంటే ఆరోజుల్లో శివకేశవులకు భేదం ఆపాదించి వారణాశిలో విష్ణు భక్తులు కరువయ్యారు.

రామభక్తుడైన తులసీదాసు శివుడు కూడా రాముని పొగడినట్లు వ్రాయడానికి కారణం శివభక్తులు కూడా ఈ రామాయణం భక్తిగా చదవాలనే.

తులసీదాసు పాత్రల చిత్రీకరణ ఎంత ఔన్నత్యంతో ఉంటుందంటే హనుమంతుడు రావణుడి గొప్పతనం అంగీకరిస్తాడు. కేవలం అతను చేసిన తప్పు సీతాపహరణం. అది దిద్దుకో, నీదెంత గొప్ప వంశం ఆ వంశ ప్రతిష్ఠ పాడు చెయ్యకు అని హితోపదేశం చేస్తాడు. **రాక్షసులేం తప్పు చేశారని వారిని చంపావు, వనం ఎందుకు పాడుచేశావని** రావణుడు అడిగితే నేను కోతిని అందుకని పండ్లు తిన్న చెట్టుని విరగతోయటం మా అలవాటు అందుకని అలా చేశాను. ప్రతి జీవికీ దేహంమీద మమకారం ఉంటుంది, అందుకని నన్ను కొట్టిన దానవుల్ని తిరిగి కొట్టి చంపాను అంటాడు హనుమ. ఎంత చక్కటి సమాధానం.

చౌపాయీ అయిపోయిన తర్వాత దోహాలో ఏదో ఒక నీతి వాక్యం ఉంటుంది. అది యథాతథంగా వ్రాయటం కోసం నేను దోహాలు (దాదాపు అన్నీ) వచనంలో వ్రాశాను. అవి కూడా పద్యాలుగా వ్రాయవచ్చు కానీ వచనంలో తులసీదాసు శైలిలోని మాధుర్యం అట్లాగే చూపించటం కోసం వచనం ఎన్నుకున్నాను.

పద్యమా గద్యమా అని కాదు ముఖ్యం. రాగయుక్తంగా పాడగలవారు పద్యం చదువుతూ మధ్యలో వచనం చదువుతున్నా కర్ణపేయంగా వుంటుంది. ఇది నా ఆలోచన.

ఇది ఎంత వరకు సబబో చదువరులే నిర్ణయించాలి. నేను ఒకవేళ తప్పయితే మన్నించాలి. కేవలం భావానికే ప్రాధాన్యత నిచ్చి కవిత్వ చమత్కారాలకు ప్రాధాన్యత ఇవ్వవద్దని మరొక్కసారి నా ప్రార్థన.

ఇక హనుమంతుడి గురించి ఒక మాట చెప్తాను. భక్తులకు అతి సులభ వశ్యుడు ఆ హనుమంతుడు. **యత్ర యత్ర రఘునాథ కీర్తనం తత్ర తత్ర కృత మస్తకాంజలిం, బాష్పవారి పరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకం** అన్నారు. ఎక్కడెక్కడ రామ కథ వినిపిస్తుంటే అక్కడ ఏదో ఒక రూపంలో ఉంటాడు ఆ రామ భక్తుడు. ఆ రాముడన్నా ఒక క్షణం ఆలశ్యం చేస్తాడేమో కానీ ఆ రామ భక్తుడు మాత్రం ఒక్క క్షణం కూడా ఆలశ్యం చెయ్యడు. మొక్కిన మరుక్షణం వారి కష్టాలు తీరుస్తాడు. ఆయన యొక్క భక్తుడవక్కరలేదు. రామ భక్తుడయితే చాలు.

వ్యాకుల పీడితయై క్షీణించు చంద్రుని వలె నున్న జానకీ మాత మారుతి దర్శనము చేత రామముద్రికను చూచి రామ సందేశమును విని తిరిగి సుందరవదనయై రామ ప్రియ భక్తుని ఆశీర్వదించిన కావ్యమగుటచే దీనికి సుందర కాండ యను పేరు సార్థకమయినది.

చివరకు ఒక మాటతో నా ఉపోద్ఘాతం ముగిస్తాను. శ్రీరామచంద్రుని దయ మూలంగానే నేను దీన్ని వ్రాయగలిగాను. వేరుకాదు. నాశక్తి సామర్థ్యాల వల్ల అసలు కాదు అని మరొక్కసారి సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

ఈ రచన మంచి చెడ్డలు నిజానికి నావికావు. అన్నీ ఆ సీతామనోవల్లభుడైన ఆ శ్రీరామచంద్రమూర్తివే. దీన్ని భక్తి పూర్వకంగా చదివిన వారికి ఆ జానకీమాత కష్టాలు తొలగించిన సుందరమూర్తి పవనసుతుడు హనుమంతుడు ఏ కష్టములూ కలుగకుండ చూడడమే కాక ఒకవేళ వచ్చినా తీర్చుగాక.

మరి మొదలు పెట్టండి. ఆలశ్యం ఎందుకు?

**సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా।**
**సుందరే సుందరీ సీతా సుందరే కిం నసుందరమ్॥**

# సుందర కాండము

## (సంక్షిప్త కథ)

శ్రీ సీతా రామ లక్ష్మణుల వనవాసమున లంకాధిపతి రావణుడు, మారీచుని మాయ లేడిగా చేసి రామ లక్ష్మణులను సీతనుండి విడదీసి మాయ సన్యాసిగా ఆమెను మోసగించి అపహరించెను. ఆమెను వెతుకుతూ రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతము చేరి హనుమంతుని వలన సుగ్రీవునితో స్నేహము చేసి వాని అన్న వాలిని వధించి అంగదునికి యౌవరాజ్య పట్టాభిషేకం చేసి తనమాట నిలబెట్టుకుంటాడు రాముడు.

కిష్కింధకు రాజైన సుగ్రీవుడు తన ప్రతిజ్ఞ నిలబెట్టుకోవటానికి అపారమైన వానర సేనను నలు దిక్కులా పంపిస్తాడు. దక్షిణ దిక్కుకు వెళ్ళిన హనుమ, జాంబవంత, అంగదాదులకు సీత జాడ సంపాతి అను పక్షీంద్రుని వలన తెలుస్తుంది, ఆమె లంకలో ఉన్నదని. సముద్రం దాకా వచ్చి ఆగిపోయిన వానరులు ఆ తర్వాత ఏం చేయాలా అని ఆలోచిస్తారు.

జాంబవంతుడు హనుమకు ఆతని పరాక్రమం వెల్లడించి నీకొక్కడికే ఈ సాగరం దాటి సీతను చూచి రాగల శక్తి వుంది అని చెపుతాడు. అపుడు హనుమ మేరు సమానంగా తన దేహం పెంచి ఒక కొండ ఎక్కి దాని మీదినుంచి లంఘించి సముద్రం దాటబోతుంటే సురస అనే నాగమాత మింగబోతే సూక్ష్మ రూపంతో ఆమె నోటిలో దూరి బైటకొచ్చి ఆమె అభినందనలు పొందుతాడు. మైనాకుడనే పర్వత రాజు తనపై విశ్రాంతి తీసుకోమంటే రామకార్యం అయ్యేదాకా తను విశ్రాంతి తీసుకునే ప్రశ్నే లేదంటాడు.

లంకచేరి తనను అడ్డుకున్న లంకిణి అనే రాక్షసిని ఒక్క గుద్దుతో మట్టి కరిపిస్తాడు. ఆమె అతనిని రామదూతగా గుర్తించి ఏనాడైతే తను ఒక కోతితో దెబ్బ తింటుందో ఆనాటి నుంచి లంక, రాక్షసులు నాశనమవుతారని చెబుతుంది.

సూక్ష్మ రూపంతో లంక ప్రవేశించిన హనుమంతుడు అన్ని భవనాలూ వెదుకుతాడు. రావణుడు వాని వైభవం చూస్తాడు కాని సీత కనపడదు. ఆ తర్వాత విభీషణుని మందిరం చేరి విభీషణునితో స్నేహం చేసి సీతజాడ తెలుసుకుని ఆమె ఉన్న అశోకవనం చేరి ఆమె పడుతున్న కష్టాలు చూసి కన్నీరు కారుస్తాడు.

రావణుడు సుందరమైన స్త్రీలతో అక్కడకు వచ్చి సీత తనని వివాహం చేసుకుంటే లంకకు రాణిని చేస్తానని తన భార్య మండోదరిని కూడా ఆమెకు దాసిని చేస్తానని అంటాడు.

ఆమె ఒక గడ్డిపోచను అడ్డం ఉంచుకుని నీవు మిణుగురు పురుగులాంటి అల్పుడివి. సూర్యుడి వంటి రాముడితో పోలిక ఏమిటి. పిరికి పందలా నన్ను ఎత్తుకు వచ్చిన అల్పుడని అంటుంది. ఆగ్రహించి ఆమె తల నరకపోయిన రావణుని మండోదరి వారిస్తుంది.

దు:ఖిస్తున్న సీతను త్రిజట అనే రాక్షసి ఓదారుస్తుంది. లంక నాశనమయినట్లు రావణుడు గాడిదపై దిశమొలతో ఊరేగినట్లు విభీషణుడు రాజైనట్లు తను కలగన్నట్లు చెప్పి సీతను గౌరవించమని చెబుతుంది త్రిజట. సీత దు:ఖిస్తుంటే సీత ముందు రాముని ముద్రిక వేసి ఆమెని కలిసి తన పరిచయం చేసుకుని రాముని వృత్తాంతం చెబుతాడు హనుమ. ఆమెకు ఊరట కలిగిస్తాడు.

హనుమ అశోకవనంలో పండ్లు తిని వనం ధ్వంసం చేస్తాడు. అడ్డు వచ్చిన రాక్షసులను చంపుతాడు. తప్పించుకున్న వారు రావణుడితో చెప్పుకోగా అతడు హనుమను చంపుటకు తన కొడుకు అక్ష కుమారుణ్ణి పంపిస్తాడు. వాణ్ణి చంపుతాడు హనుమ. రావణుడి మొదటి కొడుకు మేఘనాధుడు వచ్చి బ్రహ్మాస్త్రంతో మారుతిని బంధించి రావణ సభకు తెస్తాడు. అదే కావలసిన హనుమ రావణునికి మృదువుగా రామావతార రహస్యం చెప్పి రామునికి శరణని, సీతను ఒప్పగించి పులస్త్యుని వంశ మర్యాద నిలపమంటాడు. కానీ మూర్ఖుడు రావణుడు వినడు. చివరికి మారుతి తోకకు నిప్పు పెడ్తారు రాక్షసులు. లంకంతా కాల్చి తిరిగి వెళ్ళి కపులతో కలిసి రాముని చేరి సీత వృత్తాంతం చెప్పి రామునికి ప్రీతి పాత్రుడవుతాడు హనుమ.

ఇక్కడ మండోదరి, విభీషణుడు, మాల్యవంతుడు చేసిన హితబోధ కూడా రావణుడు వినడు, పైగా విభీషణుణ్ణి తిడతాడు. విభీషణుడు సముద్రము దాటి రాముని చేరి శరణు వేడి రాముని ప్రేమ పాత్రుడయి రాముని చేత రాజ్య తిలకుడు అవుతాడు. శత్రుసేన రహస్యాలు తెలుసుకోవటానికి వేగులను పంపిన రావణునితో ఆ వేగులే తిరిగి వచ్చి రాముడు భగవంతుడని చెపితే వాళ్ళనీ తిడతాడు. వాళ్ళలో శుకుడు రాముని శరణు పొంది శాపవిమోచనుడవుతాడు.

రాముడు సముద్రుని ప్రార్థించి, సముద్రం దాటు ఉపాయం తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాడు. విఫలుడై ఆగ్నేయాస్త్రంతో సముద్రం ఎండించబోతే సముద్రుడు వచ్చి శరణని నలుడు, నీలుడు కొండల్ని సముద్రంలో వేసినా అవి తేలుతాయి అని అలా వారధి కట్టవచ్చు అని ఉపాయం చెప్పి వెళ్ళిపోతాడు. రాముడు సిద్ధమౌతాడు. ఇదీ సుందరకాండ సంక్షిప్త కథ.



శ్లో ॥ నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్ర యమాని లేభ్యో:
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్య: ॥

## శ్రీ గోస్వామి తులసీదాసు కృత
## శ్రీరామ చరిత మానసము నందలి
# సుందర కాండము



సీ॥ భల్లూకపతి మాట పవనాత్మజుడు విని
హృదయమానందాన అలర పలికె
**సోదరా! దు:ఖాగ్ని బెదరక మీరెల్ల**
**కందమూలంబులన్ గ్రసివి వేచి**
**చూడంగ, నే సీత చూచి వచ్చెదనాకు**
**కలుగు ఆనందమ్ము ఘనత మనకు**
ఆ రీతి తాబల్కి ఆంజనేయుడపుడు
జలధి చేరెన్ రామ జపముతోడ

తే॥ అచట కలదొక్క అచలంబు, ఆటలాగ
దానిపై నెక్కి హనుమంతుడా నభమున
రామ బాణంబు రీతిగా రయము నెగిరె
క్రుంగె పాతాళ లోకాన కొండయంత.

వ ॥ హనుమంతుని రామదూతగా నెరిగిన సముద్రుడు
తనలోనున్న మైనాకమను పర్వతమును అతనికి విశ్రాంతి నిచ్చి
శ్రమను దూరము చేయుమనెను. కానీ హనుమ
ప్రేమ పూర్వకముగా దానిని తాకి, నమస్కరించి
**రామ కార్యము నెరవేర్చనిదే, నాకు విశ్రాంతి**
**ఎక్కడిదయ్యా** అని పల్కెను.



సీ॥ ఆకాశ మార్గాన ఆంజనేయుని చూచి
దేవతల్ అవ్వాని తెలివి నెంచ
ఉరగాల మాతయౌ సురస నాబడుదాని
పంప నామె అనియె **చంపినిన్ను**
**భక్షణంబును చేయ పంపిరా దేవతల్**
అంత పవన పుత్రుడామెతోడ
**ఓ మాత! నే సీత క్షేమమ్ము ప్రభువుకు**
**తెల్పి నీనోటిలో తేలగలను**

తే॥ **నిక్క మిది తల్లి పోనిమ్ము నిలువు** మనగ
సురస వినదాయె ఏ యుక్తి పారదాయె,
నన్ను తినమంచు పల్కంగ నయము మీర
నోరు చేసె యోజనముగ ఉరగమాత.

సీ॥ మెండుగా దేహమున్ రెండింతలుగ పెంచె,
పదహారు యోజనాల్ పడతి చేయ
ముప్పది రెండుగా ఒప్పెనా మారుతి,
సురస పెంచగ తాను పెరగ సాగె
నూరు యోజనములు నోరు పెంచ సురస
సూక్ష్మ రూపము దాల్చి చొచ్చెనోట
ఒడుపుగా బయలెళ్ళి ఒద్దికన్ కేల్మోడ్చి
పోవనిమ్మని గోరె పవన సుతుడు



**తే॥ నీవు ఘనుడవు బుద్ధిలో నిక్కమయ్య**
**దేవతలు పంపిరందుకే తెలిసె నాకు**
**రామకార్యంబు నెరవేరు రామభక్త!**
**బుద్ధికిని నిధానము నీవు పొమ్ము అనెను.**

వ॥ ఇట్లు ఆశీర్వదించి సురస వెడలిపోగా
హనుమ కూడా సంతసమున ముందుకు పోసాగెను

సీ॥ నివసించె జలధిలో యువ రక్కసొక్కతె
పక్షి సంతతి మాయ బట్టు చుండె
నెగురు ప్రాణుల నీడ ఎనసి పట్టుచునుండ
పక్షులెగరలేక పతనమంద గగనమందు
భక్షించు, నారీతి పవనాత్మజుని పట్ట
దాని జంపి హనుమ దాటె జలధి
అచ్చోట వనశోభ అచ్చెరువుతొ చూచె
మధులోభ ఝుంకార మధుపములను

తే॥ పెక్కు ఫల పుష్పముల నొప్పు పెను తరువుల
మనసు నుల్లాస మొనరించు వనమృగముల
పక్షి గణములన్ తాచూచి పవన సుతుడు
ఎక్కె, నిర్భీతి పర్వత మొక్కదాని.

వ॥ శంకరుడు పార్వతితో హనుమంతుని ప్రతాపమును గూర్చి అనుచున్నాడు :

**ఓ ఉమా! ఇది అంతయూ హనుమ గొప్పతనము కాదు. ఇది అంతయు ఆ శ్రీరామచంద్ర ప్రభువు మహిమ. ఆయన ఆ కాలుని కూడా నిర్జించగల సమర్థుడు**

అట్లు పర్వతము నెక్కిన హనుమ లంకా పురిని కాంచెను. అచ్చట వర్ణనాతీతమైన ఒక దుర్గము కలదు. మిక్కిలి ఉన్నతమైనదాని చుట్టూ నలువైపులా సాగరమున్నది. దాని బంగారు ప్రాకారములు మిక్కుటముగా ప్రకాశించుచున్నవి.

సీ॥ ప్రాకారముల మణుల్ బాగుగా పొదిగిరి
వీధులు భవనాలు వెలిసె నచట
అంగళ్ళు కూడళ్ళు అతిశయించెను పురిన్
గజ అశ్వరథములున్ కచ్చరములు
పదసైన్యమెంతయో పరులెవ్వ రెరుగరు
బహురూప ధరులు ఆ బాహుబలులు
వర్ణింపగా లేని వనములున్ తోటలున్
వాటికల్ కూడళ్ళు వాసినొప్పె

తే॥ నరులు నాగులున్ దేవతల్ నాట్యమాడి
మునుల మోహింప చేతురు, ముష్టి యుద్ధ
కయ్యముల గూడు మల్లుల గర్జనలచె
కడు భయంకరు లాపురిన్ కాపు కాసె.



వ॥ క్రూరులైన రాక్షసులు దున్నలను మనుష్యులను, మేకలను భక్షించుచున్నారు.

(భక్త తులసీదాసు వీరి కథ అంతా ఎంతో సంక్షిప్తంగా చెబుతున్నారు ఎందుకంటే రఘువీరుని బాణ సమూహము అనెడి తీర్థములో వీరంతా శరీర త్యాగం చేసి చివరకు సద్గతి పొందే వారే కదా!)

తే॥ అంతు లేనట్టి కాపలా తంతు చూచి
హనుమ యోచించె ఈ విధిన్ మనసునందు
నేను అతి సూక్ష్మ రూపాన నేటి రాత్రి
నగరమును ప్రవేశము చేయ నయము సుమ్మి!

సీ॥ దోమగా సూక్ష్మమౌ తోచెడి రూపాన
నరుడైన హరి దల్చి నడిచె హనుమ,
లంకిణి రాక్షసి లంకద్వారమునందు
**నన్ను ఏమరిపించి నాదు పురిని**
**చేరు వాడెవ్వడవు చోరుడా! ఎరుగవా**
**నిను నేడు మింగెదననుచు పలికె**
కపి ముష్టిఘాతాన కక్కుచు రక్తంబు
నేలకొరగి, సుంత అలుపు తీరి

తే॥ కరములతో మోడ్చి వినయాన కపితొ అనియె
**బ్రహ్మ అనె నాతొ లంకయందు**
**నిన్ను ఒకనాడు కోతియే నేలగొట్టు**
**నాడు దైత్య సంఘాలన్ని నాశమగును.**



వ॥ **నాయనా! శ్రీరామదూత వైన నిన్ను కనులారా కాంచి ఎంతో పుణ్యాన్ని పొందాను. స్వర్గము మోక్షములచే పొందు సుఖములన్నీ సాధు జన సాంగత్యము ఒక క్షణము పొందిననూ కలిగే సుఖముతో తులతూగలేవు సుమా!**

సీ॥ కోసలాపురినాధు కోరి నీ మది నిల్ప
పనులన్ని లంకలో ప్రాప్తియగును,
శ్రీరామ కృపచేత గరళంబు సుధయౌను,
అగ్ని శీతలమగు అరులు హితులు.
జలధియె గోష్పాద సమమౌను, మేరువే
తగ ధూళి అగుటయు తథ్యమగును.
అతి సూక్ష్మరూపుడై ఆంజనేయుడపుడు
రామ స్మరణతోడ లంక చొచ్చె,

తే॥ వెదకె భవనాలు, యోధుల పెక్కు చూచె
అందమైనట్టి, వర్ణింప నలవి కాని
రావణుని మందిరము చూచి పవన సుతుడు
అందు నిదురించు రావణున్ అపుడు చూచె.

వ॥ కానీ సీత జాడ తెలియదాయె. పిదప అన్నిటికీ భిన్నముగా అచ్చట ఒక భవనమును గాంచెను. అందు ఒక హరి మందిరము కలదు.దానిపై శ్రీరామ ధనుర్బాణములు చెక్కబడి యున్నవి. వర్ణింప నలవికాని శోభచే నూతనమగు తులసి మొక్కలను చూచి హనుమ మనస్సున మిక్కిలి సంతసించెను.



సీ॥ చోద్యము లంకలో సుజనుల నెలవెట్లు?
హనుమ నిద్రించెడి వాని చూచె,
మేల్కొని ఆ వ్యక్తి మేలుగా శ్రీరాము
దల్చ సజ్జనునిగ తాను ఎరిగి
హనుమ సంతసమంది వాని కలియగోరె,
సాధు సంగతి కార్య సాధనంబు
అందుచే బాపడై అతని నామ మడుగ
కరమోడ్చి ఆతడున్ కలిసి అనియె

తే॥ **స్వామి హరిభక్తులా మీరు సవివరముగ**
**మీదు వృత్తాంత మెరుగంగ మోదమగును**
**కరుణ నను కావ రాముడే కదలి వచ్చి**
**భాగ్య శాలిగా చేసె, నా భాగ్యమలర.**

వ॥ అప్పుడు హనుమంతుడు అతడు విభీషణుడని రావణుని తమ్ముడని అయినను గొప్ప రామభక్తుడు అని ఎరిగి అతనికి పూర్తిగా రామకథను వినిపించి తనపేరు వివరములు తెలిపెను. అది విని వారి తనువులు ఒక్కసారిగా పులకరించెను. రాముని గుణస్మరణచే వారి మనసు లానంద కందళితము లాయెను.

సీ॥ **పావనీ వినుమయ్య వసియించు నేరీతి**
**దంతముల నడుమ తనరు జిహ్వ**
**ఆరీతి ఇటులుంటి, ఆ సూర్యకుల శ్రేష్ఠ**
**దయనాకు కల్గునా తామసుడను,**
**రామపాదకమల లక్ష్యంబు మదిలేదు**
**ప్రభు ప్రేమ కోసమై పరగు ఆశ**
**శ్రీరాము దయచేత నీరాక కంటిని**
అనగ హనుమ పల్కె వానితోడ

తే॥ **దాస రక్షణ చేయుటే దాశరథికి**
**గొప్ప గుణమయ్య లేకున్న చెప్పుమీవె**
**హీన చంచల కపిని నే నిట్టి నాదు**
**మననమున భుక్తి కరవౌను దినమునెల్ల.**

వ॥ **అయిననూ ఓ సఖుడా వినుము నాపై కూడా ఆ శ్రీరామ చంద్రుడు తన కృపారసమును కురిపించెను.** కేవలము రాముని గుణస్మరణ చేతనే హనుమ కన్నులు ప్రేమాశ్రుపూరితము లయ్యేను.



సీ॥ ఇది నేర్చి, విషయాల ఇచ్ఛతో రాముని
మఱచి కొలువకున్న వంత పడరె
అంచు, రాము గుణము ఆత్మలో స్మరియించి
శాంతి నొంది, పిదప, ఇంతి గూర్చి
చెప్పగా, హనుమ యా సీత చూడగ గోరె,
తాను యుక్తుల తెల్పె దానవుండు,
సూక్ష్మ రూపంబుచే సుదతిని చూడంగ
వని చేరి మది చేసె వందనములు

తే॥ రాత్రి నిదురన్నదే లేని రమణిగాంచె
శుష్కమయి యుండె దేహంబు, జుట్టు జడలు
గట్టి, ఒకచోట శ్రీరామ కరుణ కొఱకు
ప్రభుని గుణ జపంబందునే పడతి యుండె.

వ॥ రాముని పదముల పైననే తన మనసు నిల్పి వాని చరణ కమలములపై నిమగ్నమయి దు:ఖించుచున్న ఆ జానకీ దేవిని చూచి పవనసుతుడు మిక్కిలి దు:ఖితుడాయెను.

సీ॥ తరు శాఖలను దాగి తాను యోచనచేసె
సీత దు:ఖము తీర్ప చేయుటేమి?
అంతలో రావణుడందాల రమణులన్
కూడి ఆ జానకిన్ చూడవచ్చె



నయమున భేదాన భయ విహ్వలను చేసి
నచ్చ చెప్పగబోయె నటన చూపి
**సుమతి! నా శపథము చూడు, రాణిని చేతు,**
**తగ నాదు భార్య నీ దాసి యగును**

తే॥ **నన్ను కను మొకపరి యని** నమ్మ బలుక,
గడ్డి పోచనే తమ మధ్య అడ్డముంచి
రాము స్మరియించి అనె యామె రావణునితొ
**నీవు మిణుగురు పురుగువు నిశ్చయముగ.**

వ॥ **మరియూ మిణుగురుల కాంతికి పద్మములు వికసించునా ఖలుడా ! నీకు రఘువీరుని బాణశక్తి తెలియదా?**
**శఠుడా! ఒంటరినై ఉన్న నన్ను అపహరించి తెచ్చిన నీచుడా! లజ్జ లేని హీనుడివి నీకు సిగ్గులేదా?**

తే॥ పోల్చె జానకి రావణు పురుగువోలె
రాముడా సూర్య సమునిగా రమణి పలుక
అట్టి కఠినంపు వచనాల అలుక పూని
తనదు కరవాలమును దూసె దనుజ విభుడు.



సీ॥ **ఓ సీత! నన్నిట్లు కసితోడ అవమాన**
**పరచు నిన్ కత్తిచే నరుక గలను**
**సుముఖి! మాట విను జీవములను వదిలేవు**
అన సీత బదులిచ్చె ఆగ్రహమున
**ఓరి! రాముని బాహులుత్పలహారమై**
**కరి తొండమై నాదు కంఠసీమ**
**అలరించ కున్నచో బలియౌదు ఖడ్గాన**
**ఇది నాశపథమౌను ఇపుడె దుష్ట!**

తే॥ **చంద్రహాసమా! శ్రీరామచంద్రు విరహ**
**జ్వాల చల్లార్చి దు:ఖాగ్ని జాడ బాపు**
**నిశిత ధారయౌ చల్లగ నెత్తురొలక**
జాన కిట్లన దనుజుండు చంప బోవ

వ॥ అప్పుడు మయసుత మండోదరి వానిని వారించి నీతి వచనముల నచ్చచెప్పెను. రావణుడు రాక్షస స్త్రీలను పిల్చి సీతను అనేక విధముల భయపెట్టి ఒక మాసములో అంగీకరింప చేయని యెడల నా ఖడ్గముతో సంహరించెదనని చెప్పుడని పలికి తన భవనమునకు పోయెను. ఇచట రాక్షస స్త్రీలు అనేక భయంకర రూపములతో సీతను భయపెట్టసాగిరి.

సీ॥ త్రిజట నామముగల తెలివైన రక్కసి
రామ చరణ భక్తురాలు అనియె
**సీత సేవింపుడీ హితవౌను, కలగంటి**
**కోతి యీ లంకంత కూల్చి కాల్చె,**
**రక్కసుల్ చచ్చిరి రావణున్ ఖరముపై**
**దిశ మొలన్ దక్షిణ దిశను చనుట**
**కంటిని బోడియై కరములన్నియు తెగెన్,**
**ఆ విభీషణుడు రాజయ్యె వినుడు**

తే॥ **రామ విజయంబు చాటించె రాజ్యమందు**
**కలిసె సీతను రాముండు, కలలు నావి**
**నిజము లౌచుండు త్వరలోనె** త్రిజట అనగ
స్త్రీలు భీతిచే మొక్కిరా సీత పదము.

వ॥ అప్పుడు అందరూ వేర్వేరు దిశలకు పోయిరి. సీత మనస్సులో ఇట్లాలోచించెను. ఆ నీచ రాక్షసుడు ఒక నెల తర్వాత నన్ను తప్పక వధించును.

సీ॥ కరమోడ్చి త్రిజటతో కడుదీనయై సీత
**నీవు నాకును తల్లి, నీడ, తోడు**
**దేహత్యాగము చేయ తెమ్ము చితిని వేల్చు**
**విరహ మోపగజాల వినగజాల**



**రావణుపల్కుల,** రమణి ఈ తీరునన్
అన యామె పదమంటి అనియె త్రిజట
**రాత్రివేళల నగ్ని రప్పింప సాధ్యమా?**
**బలశాలి రామునిన్ తలచి మనుము**

తే॥ త్రిజట ఇట్లని తనఇంటి దిశనుబట్టె
సీత **విధి** తన ప్రతికూల మతిగ తలచె
**తారలీయవు అగ్నిని ధరణి బడుచు**
**పావకుడు చంద్రుడగ్నిని అవని నిడడు.**

తే॥ **వినుము ఓ అశోకమ నాదు విన్నపమును**
**నాదుశోకము హరియింపు నీదు పేరు**
**నిలుపుకోవమ్మ ఎర్రనౌ నీదు పత్ర**
**ములను అగ్ని నన్ కాల్చవు మోహమణచ.**

వ॥ ఈ విధముగా దు:ఖించు సీతను చూచి క్షణమొక కల్పముగా హనుమ గడిపెను. కొద్దిసేపు ఆలోచించి చెట్టుపైనుండి శ్రీరాముడు ఇచ్చిన ఉంగరమును సీతముందు పడవేసెను. ఆ అంగుళీయకము తళతళ మెరుస్తుండుట వలన ఆ అశోకవృక్షమే తన ప్రార్థన విని ఒక నిప్పు కణిక రాల్చినదేమో అని భ్రాంతితో సీత ప్రసన్నురాలై ఆ అంగుళీయకమును చేతిలో తీసుకొనెను.



సీ॥ రామనామము చేత రమ్యమౌ ఉంగరం
బాసీత గుర్తించి అచ్చెరువును
ముదము వ్యాకులమైన హృదయమందున తల్చె
రఘునాథు డజయుండు, రాక్షసులకు
మాయ నీ ఉంగరం బీయంగ సాధ్యమా
అంతలో మధురమై హనుమ చేసె
రాముని గుణగాన మామె దు:ఖమునాపె,
విసె నామె లగ్నమై మనసు చెవులు

తే॥ హనుమ ప్రభు గాథ తొలినుండి అటుల పాడ
**ఎవరు పాడుదు రెదుటకు ఏలరారు?**
అనగ హనుమంతు డెదురయ్యె, అపుడు భయము
వింత నొందుచు పెడమోము ఇంతి ఆయె.

వ॥ అప్పుడు హనుమ జానకితో సౌమ్యముగా మృదువుగా ఇట్లనెను.

తే॥ **జనని! నే రామ దూతను వినుము నిజము**
**రాముపై ఆన ముద్రికన్ ప్రేమమూర్తి**
**కోరి నీకిమ్మనెను తన గుర్తుగాను**
**దాని చూడుము నమ్ముమో తల్లి ఇపుడు.**



వ॥ హనుమ అట్లనగా సీత తన సందేహము వెలిబుచ్చెను. నరులకు వానరులకు సమాగమము ఎట్లు జరిగినది తెల్పుమని అడుగగా హనుమ రామ సుగ్రీవుల మైత్రి, వాలి సంహారపు వృత్తాంత మంతయు ఆమె కెరిగించెను. వాని ప్రేమభరిత వచనములు విని ఆమె కాతనిపై విశ్వాసము కలిగెను. (ఆ క్షణమునుండి ఆమె అతని పుత్రునివలెను అతనామెను తల్లివలెను భావించసాగిరి. రామాయణమున చెప్పిన అటువంటి తల్లీ కొడుకులు మరెక్కడా కనరారు). ఆ జానకి మనోవాక్కర్మలా అతడు కృపాసముద్రుడైన ఆ రాముని దాసుడని తలచెను.

సీ॥ హరిదాసు డంచును హనుమపై సీతమ్మ
కరుణ ఆధిక్యమై కనులు తడిసె,
మేను పులకరించి మేదినీ సుత పల్కె
**పావనీ కుశలంబు పలుకు మయ్య**
**రామలక్ష్మణులకు సేమమే? నాపయిన్**
**కరుణ రాముడు వీడె కఠినుడాయె**
**దాసరక్షకుడేల దయవీడె, నెందుకు**
**నవనీత హృదయుండు నన్ను మరచె**

తే॥ **ఓడవై విరహ సంద్రాన ఉన్న నన్ను**
**హనుమ బ్రోచేవు ప్రభుయాన వినతి చేతు**
**శ్యామలాంగునిన్ చూతునా శాంతి పొంద**
అనగ అశ్రువుల్ దు:ఖాన అధికమాయె.

తే॥ నాధుడే ఒహో! పూర్తిగా నన్ను మరచె
అనుచు విరహాన రోదించు నట్టి సీత
చూచి మృదువుగ వినయంబు చొప్పి కొనగ
హనుమ ఓదార్చె వినుమమ్మ అనుచు పలికె.

వ॥ **తల్లీ ప్రభువు అతని అనుజునితో సహా క్షేమమే. నీకొరకే ఆయన దు:ఖించుచున్నారు. జననీ! నీ మనసు చిన్న బుచ్చుకొందు వేలనమ్మా! నీకు రామునిపైగల ప్రేమకు రెట్టింపు ప్రేమ ఆయనకు నీపై కలదు. నీవు ఇప్పుడు ధైర్యము వహించి రఘుపతి సందేశమును వినుము.**

సీ॥ "జానకీ నినుకోరి జనియించు విరహాగ్ని
విషయవాంఛలు నాకు విషములాయె,
నవ పల్లవములున్న నవ్య వృక్షములన్ని
అగ్నితో సమముగా అగడుపెట్టె
కాళరాత్రిగ మారె కామినీ! రేయెల్ల
చంద్రుడే సూర్యుడై చండుడాయె
కారుమేఘపు వాన మరుగు నూనెగ తోచె
కమలా లవని శూల కలితమయ్యె



తే॥ పాము బుస తీరు తోచెను పవనములును
హితులు పీడించ సాగిరి ఇట్లు నన్ను
ఒరులతో పంచుకున్నచో ఉపశమించు
దు:ఖ మందుకు ఎవ్వరి తోడ చెపుదు?

తే॥ ప్రేయసీ! నాదు మనసుకే ప్రేమరీతి
తెలియు, మనసది నీయెడన్ కలదు, దాని
ప్రేమ రసమే వియోగము పెంచసాగె"
ప్రభువు సందేశమిటు చెప్పె పవన సుతుడు.

తే॥ వినుచు ప్రేమచే సీతమ్మ వివశ అయ్యె
మేను స్పృహపోయె, ఓదార్చె అనిల సుతుడు
**మాత! హృదయాన ధైర్యమ్ము, మదిని రామ
మహిమనే నిల్పు, భీరువై మనకు తల్లి!.**

వ॥ **ఓ తల్లీ! ఈ రాక్షస మూకలు శలభ సమానములు. శ్రీరాముని బాణముచే అవి కృశించును. ధైర్యము నొందుము. ఈ రాక్షసులు నశించిరని గ్రహించుము.**



సీ॥ **నీ జాడ తెలిసెనా నీ నాధు డేనాడు
జాగుచేయడు తల్లి జానకమ్మ!
రామ బాణములనే రవితేజమందు ఈ
రాక్షస తిమిరాలు లయము అగును
ప్రభువాజ్ఞ లేదయ్యె ప్రభువుపై నా ఆన
చెప్పుచుంటిని నిన్ను చేర్తు రాము,
ధైర్యమొందుము కొన్ని దినములే ఆపైన
ఘనుడు రాముడు వచ్చి దనుజు చంపు**

తే॥ **మిమ్ము గైకొనున్, లోకముల్ మెచ్చి పొగడి
రాము కీర్తించి పాడెదరతిక భక్తి
అనగ సీతనెన్ మారుతీ! అల్పశక్తి
కలుగు వనచరుల్ దనుజుల గెలువ గలరె?**

తే॥ ఆమె సందేహమును విన్న హనుమ అపుడు
మేరు సమ రూపు చూపించె మిథిల సుతకు,
కాంచనపు దేహమతి భయంకరము అగుచు
గొప్ప బల శౌర్య శోభతో నొప్పగాను.

వ॥ అప్పుడు సీత మనస్సు కుదుటపడి ఆమెకు నమ్మకము కలిగెను. హనుమ తిరిగి మునుపటి రూపము దాల్చి **మాతా! కపులకు ఎక్కువ బలము బుద్ధి యుండవు. కానీ ప్రభువు ప్రతాపము వల్ల చిన్న పాము పిల్ల కూడా గరుత్మంతునైనా తిని వేయగలదు.** అని సీతతో చెప్పెను.



సీ॥ భక్తి ప్రతాపమున్ బలతేజముల నొప్పు
కపి మాట సీతకున్ గరపె ముదము
శ్రీరామ ప్రియుడంచు సీత నాతని పోల్చి
**బలశీలనిధివౌదు** మాత పలికె
అజరామరణముగా ఆశీర్వదించెను,
సద్గుణ నిధివివై సతతమీవు
ప్రభు భక్తులందున పరమ శ్రేష్ఠుడవౌదు
రామకృపయు గల్గు రమణి అనెను

తే॥ మాటి మాటికిన్ ప్రణమిల్లి మారుతిట్లు
అనియె ఓ **మాత! కృతకృత్యుడయితి నమ్మ!
నీదు దీవెన సత్యంబు నేనెరుగుదు
సర్వ ప్రాణులు ఎరిగిన సత్యమిదియె**

తే॥ మధుర ఫల వృక్షముల జూచి అధికమైన
ఆకలిగ నున్న దనినంత అవనిపుత్రి
రాక్షసుల కాపు కలదనె **రాక్షసులచె
భయము నాకేల?** అనెను యా పవన సుతుడు.

వ॥ **తల్లీ! నీవు శాంతముగా మదిలో ధైర్యముగా ఉన్న చాలును. ఈ రాక్షసులు నాకొక లెక్కకాదు. అని హనుమ చెప్పగా బుద్ధి బలమునందు కపివరుండు నిపుణుడని గ్రహించి జానకీదేవి ఇట్లు చెప్పెను. నాయనా! వెళ్ళి రఘుపతి చరణములపై నీ మనస్సు లగ్నము చేసి ఆ మధుర ఫలముల నారగింపుము** అప్పుడు హనుమ సీతకు శిరసువంచి నమస్కరించి....

సీ॥ వృక్షాల పెకలించి వాటి పండ్లను తిని
కాపున్న దనుజుల రూపుమాపె
దానవుల్ కొందరు తప్పించుకొని **ప్రభూ**
**పెనుకోతి చెరచెను వనమునెల్ల**
**పండ్లు తిని పిదప వనరక్షకుల తన్ని**
**మర్దించి దవ్వున బడగ విసిరె**
అన రావణుడు యోధులను బంప, గర్జించి
హతమార్చె నెల్లరన్ హనుమ యంత

తే॥ పారి చావు తప్పగ వచ్చు వారి చూచి,
అసురుడును వాని పుత్రుడౌ అక్షు పంప
వృక్షమొకదాని పెకలించి అక్షు చంపె
గర్జనమ్మును చేసెనా కపివరుండు.

వ॥ ఆ పిదప కొందరిని చంపెను, కొందరిని మర్దించెను. మరికొందరిని పట్టుకొని మట్టిలో కలిపెను. కొందరు ఎట్లో తప్పించుకుని వెళ్ళి రావణునితో **ప్రభూ! ఆ వానరుడు మిక్కిలి బలశాలి** అని మొరపెట్టుకొనిరి.

సీ॥ మరణించె సుతుడని మండెను దనుజుడు
మిక్కిలి బలశాలి మేఘనాధు
ప్రథమ పుత్రుని పిల్చి పట్టి ప్రాణాలతో
కపి తెమ్ము, ఎటులొచ్చె ఖలుడు ఇటకు



అన ఇంద్రజిత్తుండు అనికేగుదెంచెను
అనుజు చంపిన కోపమతిశయించె
దారుణంబౌ శత్రు దరుదెంచెనని కపి
పళ్ళు పటపటంచు పడెను పైన

తే॥ తరువు నొకదాని పెకలించి విరథు చేసె
బలిమి దనుజుల బాగుగా నలిపి వైచి
రెండు మదగజములు పోరు చుండునట్లు
హనుమ వానితో పోరాడె అద్భుతముగ.

తే॥ కొట్టె పిడికిలిన్ దనుజుని, చెట్టునెక్కె
దైత్యుడంతట మూర్ఛిల్లి తెప్పరిల్లి
మాయ యుద్ధంబు చేసె నా మారుతికిని
ఏమి కాకుండె, యోచించె ఇంద్రజిత్తు.

వ॥ చివరకు అతడు బ్రహ్మాస్త్రమును సంధించి ప్రయోగించగా ఈ విధముగా హనుమ మనస్సులో ఆలోచించెను. **నేను ఇప్పుడు బ్రహ్మాస్త్రమును మన్నించనిచో దాని అపార మహిమ వ్యర్థమగును.**

సీ॥ బ్రహ్మాస్త్రమే కొట్ట, పడె చెట్టుపైనుంచి
పడి రాక్షసులపైన పడుచు చంపె,
మేను సోలిన కపిన్ మేఘనాధుడు నాగ
పాశాన బంధించి పట్టితెచ్చె,



**ప్రభునామ జపముచే పార్వతీ! సంసార**
**బంధాల మనుజులు పట్టుబడరు**
**రామదూతను బంధమేమి చేయగజాలు?**
**ప్రభు కార్యమునకు తాపట్టుబడెను.**

తే॥ కోతి బంధింప బడెనంచు కౌతుకమున
సభకు చేరిరా రాక్షసుల్, వైభవమున
అలరు సభ చూచె మారుతి, అసురు చూచి
భీతి దేవ దిక్పాలురు బెదరుచుండ.

వ॥ కానీ పవనసుతుడు మాత్రము సర్పసమూహములోనున్న గరుత్మంతునివలె నిర్భయుడై యుండెను. దశాననుడు కపిని చూచి దుర్భాషలాడుతూ నవ్వెను. పిదప తన పుత్రుని వధ జ్ఞప్తికి వచ్చి మనస్సున విషాదము కలిగిన వాడై ఇట్లనెను.

తే॥ **కోతి! ఎవరవు? ఏ బల్మిచేత వనిని**
**నాశమొనరించి నాడవు? నాదు కీర్తి**
**గొప్ప వినలేదె? దనుజుల తప్పు ఏమి?**
**చంపితివి దానవుల నేల చావు కోరి.**

వ॥ హనుమ రావణుని కిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

సీ॥ **ఇది విను రావణా! ఎవ్వారి బలముచే**
**బ్రహ్మాండమును సృష్టి ప్రకృతి చేసె?**
**ఎవ్వారి బలముచే ఈశుండు హరి బ్రహ్మ**
**లయము స్థితిన్ సృష్టి చేయుచుండె?**



**వినుము నెవరి బల్మి వేయి ఫణుల శేషు**
**డీయిలన్ తలదాల్చి మోయుచుండె?**
**అవతారములనెత్తి దేవతల నెవరు**
**బ్రోచె దుష్టుల చంపి పుడమి యందు?**

తే॥ **ఎవరు నీబోటి మూర్ఖుల కిచ్చు శిక్ష?**
**ఎవరు నీబోంట్ల మద భంగ మవని చేసె?**
**హరుని విలుద్రుంచె? ఎవ్వాడు ఖరుని చంపె?**
**త్రిశిర దూషణు లెవరిచే నాశమయిరి?**

వ॥ **ఎవ్వరి బలములోని లవలేశముతో నీవు ఈ చరాచర సమస్తమును జయించి కూడా పిరికిపందవలె కపటమున ఎవరి పత్నిని దొంగిలించితివో ఆ ప్రభువు శ్రీరామచంద్రుడు తప్ప అన్యులు కారు. నన్ను ఆయన దూతగా ఎరుగుము.**

సీ॥ నీ గొప్ప నెరుగనే నీవపుడు సహస్ర
**బాహుతో రణమున పారినావు**
**వానితో పోరంగ వాసియున్ కలిగెను,**
విన్న మూర్ఖుడు నవ్వి మిన్నకుండె,
**ప్రభు! నేను క్షుద్బాధ ఫలముల దింటిని**
**పెను వృక్షముల కపిన్ విరచినాడ**
**కాయమ్ము ప్రాణికి ప్రియమైన దవుటచే**
**కొట్టగన్ దనుజుల కొట్టినాను,**

తే॥ బ్రహ్మ అస్త్రాన బంధింప బడితినిట్లు
లజ్జ ఏటికి? ప్రభుకార్య లక్ష్యమొకటె
నేను కేల్మొక్కి వేడెదన్ నిన్ను, వినుము
బ్రహ్మవంశజా యోచింపు పరువు నిలుపు.

తే॥ భ్రమను విడు భక్తభయహారి భజన సుఖము,
మనుజ దేవాసురుల చంపు ఘనుడు కాలు
డెవని చూడంగ భీతిలు ఎవని గొల్చు
అట్టి రాముతో వైరంబు అగునె మేలు?

వ॥ జానకీ మాత నిచ్చి శరణు వేడుము. ఖరుని చంపిన రఘునాధుడు శరణాగత రక్షణ వ్రతుడు. ఆయనను శరణు జొచ్చిన ఆ ప్రభువు నీ అపరాధములను క్షమించి నిన్ను కాపాడును. నామాట వినుము.

సీ॥ రామపదాబ్జముల్ నీ మదిన్ ధ్యానించి
 లంకను నిరతము రాజ్యమేలు,
ఆ పులస్త్యుని కీర్తి అను శశిన్ మచ్చవై
 మననేల యోచింపు, మనవి వినుము
రామనామము లేక రాణించునా వాణి
 మద మోహములు వీడు మో సురారి!
ఆభరణములున్న అతివ అంబర హీన
 అయిన శోభించునా అవని యందు



తే॥ రామ విముఖుడే సంపద, రాజ్యమున్న
నాశమయి తీరు, ఉన్ననూ ఆశలేదు
వర్షముల నిండు నదులెన్ని వసుధ నున్న
వేసవిని ఎండి పోవుటే వీటి గుణము.

తే॥ రావణా! విను నా ఆన రామద్వేషి
నెవరు రక్షింపగాలేరు ఇదియె నిజము
రామ వైరంబు పూన నిన్ రక్షచేయ
రిలను, హరి బ్రహ్మ ఈశ్వరు లెందరైన.

వ॥ మోహమూలమైనదీ దు:ఖప్రదమైనదీ తమోగుణ ప్రధానమయిన అహంకారమును వీడుము. రఘునాయకుడు కృపా సముద్రుడు అయిన శ్రీరాముని భజింపుము.

సీ॥ భక్తి వివేకంబు పరగు వైరాగ్యంబు
 అలరు నీతులనట్లు హనుమ చెప్ప
దురభిమానంబుతో తులువనెన్ నవ్వుచు
 జ్ఞాన ఖనియె కోతి మనకు గురువు
ఖల! చావు దరిచేర ఏల యీ బోధలు
 వ్యతిరేక మవుననెన్ పవనసుతుడు
నీ మతిచెడె మూర్ఖ నేననుకొందును
 కపి యనన్ దనుజుడు కుపితుడయ్యె



తే॥ ఎవరురా వీని వధియింపరేల అనెను
దానవులు సిద్ధమవ విభీషణుడు మొక్కె
దూత వధియింపకాదయ్య నీతి, తమరు
వేరు రీతిని శిక్షింప విహితమనెను.

వ॥ అచ్చట అందరూ విభీషణుని సమర్ధించిరి. రావణుడు కూడా నవ్వి సరే, ఈ కోతికి అంగ వైకల్యము చేయుడు. వానరులకు వాలమన్న ప్రీతి అని అందరూ చెప్పెదరు. కావున, నూనెలో బట్టలను ముంచి వీని తోకకు చుట్టి నిప్పు అంటించుడు అని చెప్పెను.

సీ॥ తోక పోయిన కోతి తోడ్తెచ్చు యజమాని,
 వచ్చినన్ చూతుము వాని మహిమ
రావణు మాటకు పావని తలచెను
 శారద నీమాట జరుపు నిజము
లంకేశు ఆజ్ఞచే రక్కసుల్ మూర్ఖులై
 వాలము కాల్చెడి పనిని బడిరి
వాలమున్ పెంచంగ వస్త్రముల్ లంకలో
 తైలాజ్య భాండముల్ తటిగిపోయె



తే॥ కాల దన్నుచు దనుజులు గేలిచేసి
డోలు వాయించి చప్పట్ల గోల చేసి
నగరమున త్రిప్పి తోకకు అగడుపెట్ట
రగులు అగ్నినిన్ కపి చూచి లాఘవముగ.

వ॥ బంధములు విడిపించుకుని, బంగారు ప్రాకారములపై దుముక సాగెను. అదిచూసి రాక్షస స్త్రీలందరూ హాహాకారములు చేసిరి. అదే సమయమున హరి ప్రేరితములై నలుబదితొమ్మిది వాయువులు ఒక్కసారిగా వీచెను. హనుమంతుడు అట్టహాసముగా గర్జించి ఆకసమెత్తునకు పెరిగెను.

సీ॥ సువిశాల కాయుడై చూడ లాఘవముతో
 పురి భవనాలపై పోయె దుమికి,
అగ్ని కాహుతి ఆయె అసుర మూకలు యన్ని
 అన్ని దిక్కుల కమ్మె అగ్ని శిఖలు,
“ఆపదన్ రక్షించు అమ్మేది, అయ్యేడి
 ఒంటరి కపి కాదు అంటి మపుడె
దేవతెవ్వరొ కాని దివ్యకపిగ నేడు
 తృటిలోన లంకంత తగుల బెట్టె

తే॥ సాధులవమాన మీ విధిన్ బాధ పెట్టు
నగరమంత ననాథయై మిగిలిపోయె
అంచు విలపించ దానవుల్ అపుడు హనుమ
ఆ విభీషణు ఇంటిని అంటకుండె.

వ॥ ఓ పార్వతీ! అగ్నిని సృజియించిన ఆ రాముని దూతయే హనుమంతుడు కనుక అగ్ని మారుతిని కాల్చలేదు. అని శంకరుడు పలికెను.
అటు ఇటూ తిరుగుచూ లంక అంతా కాల్చి పిదప ఎగిరి సముద్రములో దుమికెను.

తే॥ వాలమునకున్న అగ్నిని నిలువరించి
అలపు తీరగ లఘురూపు దగుచు హనుమ
సీత సముఖాన నిలుచుండె, సీతజూచి
చేతులను మోడ్చి అనె నిట్లు మాత తోడ.

సీ॥ శ్రీరామువలె మాత! చిహ్నంబు నీయుమా
సీత చూడామణిన్ చేతికిచ్చె
హనుమ హర్షముతోడ దానినిన్ గ్రహియించ
పలికె జానకి ప్రీతి పవన సుతుతొ
నాయనా! ప్రభువుకున్ నా మాటగా చెప్పు
పూర్ణ కాములు మీరు పుడమియందు
దీన రక్షకుడంచు దీటుగ బిరుదున్న
స్వామి! తప్పింపు నా సంకటమును,



తే॥ ఇంద్రసుతు గాథ వినిపింపు,
తెమ్ము జ్ఞప్తికి ప్రభు బాణ దివ్య మహిమ,
మాసములొ స్వామి రాకున్న మరణమొకటె
అండ, నిలిపెదన్ ప్రాణాలు అంత దనుక.

వ॥ ఓ హనుమా! తిరిగి వెళ్ళుటకు అడుగుచున్నావు. నిన్ను చూచి నా మనసు చల్లారినది. ఇక పూర్వపు రీతిగనే నాకు పగలు రాత్రి ఏర్పడును హనుమ సీతాదేవికి నచ్చచెప్పి, అనేక విధముల ఓదార్చెను. ఆమె చరణములకు శిరసా ప్రణమిల్లి శ్రీరాముని వద్దకు బయలుదేరెను.

సీ॥ మరలుచున్న హనుమ ఘోర గర్జన చేసె
గర్భపాత మసుర కాంత లొందె,
అబ్ధిని లంఘించి హర్ష ధ్వనిని చేయ
మారుతిన్ కని తాము మరల జన్మ
పొందినట్లు ముదము పొందెను కపిసేన,
హనుమ ముఖపు కాంతి కనుచు, వారు
రామకార్యంబయ్యె లక్షణంబుగ నంచు
తెలిసిరి ముదమున తేలి రపుడు.

తే॥ జలము వీడి తపించెడి మీలు పిదప
జలము చేరిన యట్టుల సంతసించి
రాము చూడంగ కిష్కింధ రయము నేగి
చేరి మధువనిన్ విడిసిరి చింత వీడి.



తే॥ చెట్లు విరిచిరి ధ్వంసంబు చేసి రపుడు
కోరి అంగదు సమ్మతి కోసి పండ్లు
వాటి భక్షించి, కాపరుల్ పట్టి ఆప
ముష్టి ఘాతాల తరిమిరా మూకలపుడు.

వ॥ వని కాపరులు యువరాజు అంగదుడు వనము నాశనము చేసినాడు అనిన తడవుగా సుగ్రీవుడు వానరులు రామ కార్యము సాధించుకొని వచ్చినారని గ్రహించెను.

సీ॥ సీత జూచుట చేత చెలరేగి రటుగాక
ధ్వంసంబు చేతురే తలచె రాజు,
వానరుల్ అంతలో వాని పాదము తాక
చేర్చి కౌగిలి వారి సేమ మడిగె,
హనుమయే ప్రభు కార్య ఆచరణతో మాకు
ప్రాణాలు దక్కించె పలికె వారు
హనుమ నక్కున చేర్చి, చనె రాము చూడంగ,
వారి హర్షము చూసి ప్రభుకు తెలిసె

తే॥ సుదతి కనిపించె నంచని సోదరులును
అచట కూర్చొని వానరుల్ అపుడు మ్రొక్క
రాము దందరిన్ కౌగిట ప్రేమ చేర్చి
కుశల మడుగంగ కపివరుల్ కూడి అనిరి.



వ॥ ప్రభూ! మీ చరణ కమల దర్శనమయినది కావున మేమందరమూ కుశలమే.

సీ॥ జాంబవంతుడు రాము చరణ మంటిట్లనెన్
దైవమా వినుడు తామెవరి పైన
కృప జూతురో వారు కడు శుభమ్ముల నొంది
దేవతా, నర, ముని దీవెనలను
పొందగ, విజయులై పుడమి సుగుణులౌచు
వినయులై లోకాన ఘనత పొందు,
నీ కృపన్ మా జన్మ నిక్కము తరియించె,
హనుమ ఘనత చెప్ప అలవి కాదు

తే॥ వేయి నోళ్ళను వర్ణించ వీలుకాదు
హనుమ సుందరంబవు కథన్ వినుడు మీరు,
కరుణ రాముండు మారుతిన్ కౌగలించి
సంతసంబునన్ ప్రశ్నించె సీత గూర్చి.

వ॥ ఓ ప్రియ సఖుడా! జానకి ఏ విధముగా నున్నది తన ప్రాణములనెట్లు నిలుపు కొనుచున్నది? అని రాముడనగా హనుమ మీ నామమే ఆమెకు పగలూ రేయీ, మీ ధ్యానమే జీవనము. తన దృష్టిని నీచరణములపై నిలుపుకున్నది. అదే ఆమె ప్రాణములను నిలుపుచున్నది ప్రభూ! అనెను.

సీ॥ సీత చూడామణిన్ ప్రీతితో పంపించె
అని రాము కీయంగ హత్తుకొనెను
హృదయాన, ఆపైన హనుమ ఇట్లని అనెన్
శ్రీరామ రోదించి సీత అనియె
స్వామి పాదములంటి చక్కగా చెప్పుము
దీనబంధు! శరణ దాన వ్రతులు
చరణ దాసిని నేను, జరిగె నే పాపమ్ము
నన్ను త్యజించిరి నాథ! ఏల?

తే॥ ఒప్పుకొందును దోషమ్ము ఒకటి కలదు
మీ వియోగాన ఉన్నను జీవముండె
తమను వీక్షించ కోరు నేత్రములదొను
తప్పు, ప్రాణాల కవె అడ్డు తగిలె స్వామి

తే॥ విరహ మగ్గియై దూదిగా మారె మేను
గాలి శ్వాసయై క్షణములో కాలిపోవ
కన్ను లివి మిమ్ము చూడంగ కార్చి నీరు
అగ్ని నార్పెను దగ్ధంబు అవక యుంటి.



వ॥ గాలి తోడైననూ ఆ అగ్ని ఏమీ చేయలేకున్నది నన్ను. ఈ విధముగా చెప్పమని ఆమె వేడుకున్నది. ప్రభూ! సీతమ్మ ఆపద అనంతము ఓ దీన దయాళూ దాని గురించి చెప్పకుండుటే మంచిది. ఓ కరుణానిధీ! ఆమె ప్రతి నిమిషమూ ఒక కల్పము వలె గడుపుచున్నది. వేగమే మీరు చని మీ భుజ బలముచే ఆ దుష్ట దానవులను పరిమార్చి సీతాదేవిని కొని తెండు. ఆమెను రక్షింపుడు.

సీ॥ శ్రీరామచంద్రుడు సీత దు:ఖము విని
అశ్రువుల్ నిండగా అనెను ఇట్లు
మనసు వాక్కాయాల నను గతిగా నెంచు
భక్తులు కలనైన బాధ పడరు
పావని ఇట్లనెన్ దేవ మీ స్మరణనే
జరుప కుండుట కన్న చావు కలదె
అసురులు సాటియా హరియించి వారిని
సీతను విడిపించు శీఘ్రముగను

తే॥ ఆర్తితో అనెన్ రాముండు హనుమతోటి
హనుమ! నీసాటి ఉపకారి కనగ నగునె
దేవ నర మౌని గణములన్ తెలుపు మయ్య
నీకు ఉపకారమేరీతి నేను చేతు?



తే॥ వత్స! ఋణము తీర్చంగ నా వలను కాదు
మదికి తోచె నావిధముగా, మనసు మూగ
పోయె మాటలు రాకుండ పోయె అనుచు
సజల నేత్రాల చూచెనా సఖుని ప్రభువు.

వ॥ అట్టి రామచంద్రుని చూచిన హనుమ కన్నులునూ
సజలములై తనువు పులకరించెను.
ప్రభు వచనములు విని, ఆయన ప్రసన్న ముఖమును
చూచి మారుతి సంతోషముతో ప్రేమ మగ్నుడై
ఓ దేవా పాహి పాహి అనుచూ స్వామి పాదములపై పడెను.

సీ॥ ప్రతిమారు రఘుపతి భక్తు లేపగ బోవ
పావని ప్రేమచే లేవకుండు,
తలపైన కరముంచి దరి చేర్చె ప్రేమతో,
(చూచి ఆ దృశ్యంబు శూలి సతికి
సుమనోహరంబైన రామ కథను చెప్పె)
ప్రభువు తా యురమున భక్తు చేర్చి
కరములన్ కరముంచి దరిచేర కూర్చుండ
లంక కాల్చితివెట్లు? రాముడడిగె



తే॥ ప్రభువు ఆనందమును చూచి పరవశించి
హనుమ ఇట్లనెన్ ఓ ప్రభూ! వానరులకు
తరువు శాఖలన్ దూకుటే ఎరుక యగును
నేను సంద్రమున్ దాటితిన్ నీదు మహిమ.

తే॥ లంక కాల్చుట, చంపుట రాక్షసులను
వనము ధ్వంసంబు చేయుట, వినుము స్వామి
తమరి దీవెన చేతనే తప్పు నాదు
ఘనత ఓ ప్రభూ! శూన్యమనెదనేను.

వ॥ ప్రభూ! నీవు అనుకూలుడవైన అసాధ్యమేదీ ఉండదు. నీ ప్రభావముచే చిన్నదూది పింజ కూడా సముద్రము లోని బడబాగ్నిని కాల్చగలదు.

సీ॥ అత్యంత సుఖకరంబగు నిశ్చలపు భక్తి
తన కిమ్మని హనుమ వినతి వేడ
ఇది విని రాముండు ఏవమస్తు అనియె.
పార్వతీ! రాముని భక్తవరులు
భక్తి రామరసపు పానమొక్కటె గాని
వేరొండు రుచి యుంట నెరుగ బోరు
ప్రభువు భక్తుల మధ్య రమ్య సంవాదమ్ము
విన ప్రభు పదభక్తి విరియు మదిని

తే॥ కడకు ప్రభు మాట లాలించి కపి జనంబు
జయము శ్రీరామ జయమంచు జయము పలుక
చేరి సుగ్రీవు, ప్రభువనెన్ **చేయుమయ్య**
**పనుల ఏర్పాటు జాగేల వానరేంద్ర!**

వ॥ ఆ భగవానుని లీలలను కని దేవతలు హర్షితులై పూలవాన కురిపించి, ఆకాశ మార్గమున తమ తమ నెలవులకు పోయిరి. వెంటనే కపిరాజు సుగ్రీవుడు తన యోధులను పిలిపించగా వారందరునూ వచ్చిరి. వివిధ విచిత్ర వర్ణములుగల వానర భల్లూక సమూహములు ఆ సేనలలో కలవు. వారు అపార బలశాలురు.

సీ॥ బలశాలురైనట్టి భల్లూక కపిసేన
రామపదములకు ప్రేమ మొక్కి,
గర్జించ వారిపై కమలాక్షుడును కృపా
దృష్టి చూడగ బలదర్పులైరి,
రెక్కలు మొలవగ రేగెడి గిరు లైరి
ప్రభువు హర్షంబుతో పయనమయ్యె
మంగళ ప్రదుడైన మధువైరి చనునెడ
శకునముల్ శుభమయ్యె శంక లేక.



తే॥ వామ భాగము అదరగా వసుధ సుతకు
రామ ప్రస్థాన మెరిగె ఆ రమణి అపుడు
ఖలుడు దుశ్శకునాలచే కలత నొందె
వర్ణనా తీతమౌ సేన బయలు దేర.

వ॥ అనంతమైన ఆ సేనలోని వానరులు, భల్లూకములు గర్జన చేయుచుండిరి. నఖములే శస్త్రములుగా గల ఆ వనచరులు పర్వతములనూ వృక్షములనూ ఆయుధములుగా ధరించి కొందరు నేలపైనా కొందరు ఆకాశ మార్గమున పోసాగిరి. వారి సింహగర్జనను విని దిగ్గజములు సైతము వణికి పోయెను.

తే॥ దిగ్గజముల ఘీం కారాన దిక్కులదిరె,
గిరులు కదలాడె సాగరమురక లెత్తె,
ఖేచరులు తల్చె తీరు మా ఖేదమనుచు
పళ్ళు పటపటా కొరుకుచు పారె సేన.

సీ॥ జయజయ ధ్వానాల జయము రాముని కంచు
రామ కీర్తనలతో భూమి నిండె
ఆ సేన భారమున్ ఆదిశేషుడు కూడ
మోయ సాధ్యము కాక మోహితుడయె,
ఆది కూర్మపు వీపు అదిమి పట్టుచు నుండె,
రామ ప్రస్థానమ్ము రచన చేయు
చుండెనా వీపుపై చొక్కుచు శేషుండు
అనునట్లు శోభించె ఆతడపుడు,



తే॥ వేగ పయనించె రఘునాధు వీరసేన
చేరి రందరున్ సాగర తీరమందు,
లెక్క కందని వనచరుల్ అక్కడున్న
ఫలములను ఆరగించిరి చెలగ ప్రీతి.

సీ॥ హనుమ లంకను కాల్చి చనిన యప్పటి నుంచి
దనుజులు ఇండ్లలో దాగి యుండి
తలచిరి ఇట్లని **దనుజుల నిప్పుడు**
**రక్షించుటే రీతి? రక్ష ఎవడు?**
**రామదూతయె ఇట్లు రాక్షసాంతము చేయ**
**రాముడే వచ్చినన్ క్షేమమగునె?**
తన దూత లిది చెప్ప దానవేంద్రుని రాణి
రావణు పదమంటి బ్రోవుమనెను.

తే॥ **నాథ! హరివైరి కాబోకు, నాదు మాట**
**వినుమ, దనుజ కాంతలు నాటి హనుమ రూపు**
**తలచ గర్భ పాతమ్ములె కలుగ సాగె**
**ప్రజల హితకారి వైనచో నిజము కనుము.**

**తే॥ దనుజ కులమనే కమలాల వనమునంత**
**నాశమొనరింప హిమమౌచు నారి వచ్చె,**
**నాథ! సీతను విడకున్న నలువ, హరులు**
**తమరి రక్షణ చేయరు రామునుండి.**



వ॥ **శ్రీరాముని బాణములు సర్పముల వంటివి. దానవులు కప్పల వంటివారు. అవి వారిని కబళింపక ముందే ఏదయినా మంచి ప్రయత్నమున ఉపాయము చేయుడు. నామాట విని ఇప్పుడే పనిగా ఒక మంత్రిని తోడుగా పంపి సీతను ఆమె భర్త శ్రీరామునకు ఇచ్చివేయుము.**

సీ॥ ఆ మాట విని నవ్వె అత్యంత గర్విష్ఠి
మూర్ఖుండు దనుజుడు మురిసి బలికె
**నిక్కము స్త్రీలంత నెమ్మదిన్ భీరువుల్**
**శుభము నశుభముగా చూడగలరు,**
**వానరుల్ వచ్చిరా, దనుజులు తిని వారి**
**జీర్ణించు కొందురు చింత వలదు,**
**దిక్పాలు లెల్లరు దీనులే నా ముందు**
**వద్దు హాస్యము, రాణి వలదు భయము**

తే॥ అనుచు కౌగిలి చేర్చెను, చనియె సభకు,
ఆమె విపరీతమౌ విధి అనుచు వగచె,
సభను చేరంగ వానికి సాగరమును
వానరుల సేన చేరన వార్త తెలిసె.

తే॥ మనకు కర్తవ్య మెద్ది ఓ మంత్రులార
చెప్పుడన, వారు హాస్యము నొప్ప అనిరి
ఊరకుండుట యే ప్రభూ! సురల గెలుచు
ఘనులు కపి నరాధములచే హాని యగునె?

వ॥ మంత్రి గానీ వైద్యుడు గానీ గురువు గానీ
ప్రభువు ఆగ్రహించునని భయము చేతనో
లేక ఏదైనా ఆశచేతనో కేవలము
ప్రీతి వాక్యములే పల్కి చెడు ఎరుగ చెప్పకున్నచో
రాజ్యము శరీరము ధర్మము ఈ వరుసలో
శీఘ్రముగా నాశనమగును.

సీ॥ అతి ముఖ స్తుతి చేత నారీతి మూర్ఖుడౌ
వానితో అనుజుండు అనెను మొక్కి
ఓ కృపాళా విను, ఒప్పుగా తెల్పెదన్
మీకిది హిత మంచు నాకు తోచె
శుభము కీర్తియు బుద్ధి సుఖము సద్గతి కోరు
వారు పరసతుల వదనములను
చవితి చంద్రునివోలె జననాథ కనరాదు,
లోకాల ప్రభువైన లోకులందు



తే॥ వైరి భావమ్ము నుంచంగ పతనమగును,
సద్గుణ సముద్రుడు మరియు చతురుడైన
వాడు లోభియై నందున వసుధ యందు
వాని మెచ్చరు ఏనాడు వినుము బుధులు.

వ॥ ప్రభూ! కామ క్రోధ లోభ మదములు నరకమునకు మార్గములు. కావున వీని నన్నిటినీ త్యజించి సజ్జనులు భజించెడి ఆ శ్రీరామచంద్రుని భజింపుము.

సీ॥ ఓ స్వామి రాముండు ఉర్విలో రాజంచు
తలవంగ బోకు, లోకాల విభుడు,
జమునికే మృత్యువు, జన్మలేని యజుండు,
సర్వ వ్యాప్తుడు సర్వ శక్తి యుతుడు,
గోబ్రాహ్మణుల దేవ గురువుల రక్షించు
దేవ దేవుడు భువిన్ అవతరించె,
దాస త్రాతయు వాడె దనుజ హారియు వాడె,
వేద రక్షకుతోడ వైరమేల

తే॥ బడుగు శరణార్థి రక్షణే వాని వ్రతము
సీత ప్రభుచేర్చి వేడుము అతని శరణు
విశ్వద్రోహులు సైతంబు వేడ శరణు
తాపత్రయముల తీర్చెడి దాతయతడు.



వ॥ ఈ విధముగా విభీషణుడు రాముని ఘనతను రావణునికి వివరించెను. అయినా ఆ మూర్ఖుడు వినలేదు. మరల అన్నగారి పదములనంటి ఇట్లనెను. మోహ మద మత్సరములు వదిలి వేసి ఆ కోసలేంద్రుని భజన చేయమని, వాని స్నేహము సర్వ శ్రేష్ఠమని, నేను మీకు విన్నవించిన రాముని అవతార రహస్యము స్వయముగా ఆ పులస్త్య మహా బ్రహ్మ తన శిష్యునికి బోధ పరిచెను. ఆ శిష్యుడే నాకు చెప్పగా విని మీకు చెప్పుచున్నాను. ఇది నిక్కము. ఓ ప్రభూ! ఇంత మంచి అవకాశము వచ్చినందుననే మీకు మరల మరల చెప్పుచున్నాను. మీరు కూడా ఆ పులస్త్యముని మాటను తప్పక పాటించండి.

సీ॥ మూల్యవంతుండనే మంత్రియు అది విని
ముదమొప్ప రావణు ముందు బలికె
నాయనా! అనుజుండు నయము చెప్పె వినుము
లంకేశుడుగ్రుడై రంకె వేసె
మూర్ఖులిద్దరు శత్రు ముదమున పొగడేరు
ఇరువురిన్ మెడపట్టి తరుమరేల?
మాల్యవంతుడు గృహ మార్గమున్ బట్టగా
ఆ విభీషణుడిట్లు అనెను మరల

తే॥ స్వామి! లోకాన కుమతులున్ సుమతు లుందు
రనుచు వేదాలు ఘోషించె వినుము, సుమతి
ఉన్న చోటనె సంపదల్ ఒనరు, కుమతి
ఉన్న చోటనె ఆపదల్ యుండునన్న.



వ॥ మీకు అహితము హితముగా, మిత్రులు శత్రువులుగా తోచుచున్నారు. రాక్షస కులమును నాశనమొనరించు కాళరాత్రి అయిన సీతపై మీరు ఎక్కువ ప్రీతి కలిగి యున్నారు. ఇది తగదు.

తే॥ వినుము నీ పాదమంటినే వేడుకొందు
ప్రేమతో నన్ను తమ్ముని పెంచి తీవు
విన్నపము సమ్మతిని నీవు వినుము స్వామి
సీత త్యజియింపు అశుభమ్ము చేరదపుడు.

సీ॥ బుధ జనుల్ వేదాలు బోధించు నీతిని
ఆ విభీషణుడట్లు అసుర పతికి
బోధింప కోపాన బుసకొట్టి ఇట్లనెన్
దుష్టుడా నీ చావు తోసుకొచ్చె,
నావల్ల తినుచుండి నా శత్రు పొగడేవు
నన్ను ఓడించేటి నరుడు కలడె?
తగుచు లంకలొ ప్రీతి తాపసులను కూడి
వారితో బ్రతుకుము గరపు నీతి

తే॥ కాలితో తన్నె తమ్ముని, కాని యతడు
అన్న పాదాల నంటుచు అనెను ఇట్లు
మీరు పితృసములో యన్న! వేరు కాదు
రామ భజనమే హితవౌను తమరి కిపుడు.

వ॥ శివుడు పార్వతితో ఈ విధంగా రామకథ కొనసాగిస్తూ అన్నాడు. ఓ ఉమా! అపకారికి కూడా ఉపకారము చేయుటే సజ్జనుల స్వభావము. అందుచేతనే అవమానింపబడీ కూడా విభీషణుడు రావణుని హితము కోరి చెప్పెను. చివరకు విసిగిపోయి తన మంత్రులతో రావణుని వీడి ఆకాశ మార్గాన పోవుచూ అందరూ వినునట్లు ఇట్లు పల్కెను. "ఓ రావణా! శ్రీరాముడు సత్యవ్రతుడగు ప్రభువు. నీ సభ త్వరలో నాశనము కానున్నది. నేను రఘువీరుని శరణార్థినై పోవుచున్నాను. తర్వాత నన్ను నేరస్థునిగా, ద్రోహిగా భావింప వలదు."

సీ॥ అట్లు విభీషణు డాలంక వీడంగ
దానవుల్ మృతప్రాయులైన వారు,
భక్తులు సజ్జనుల్ పరిహాస మగుచోట
అశుభమ్ము తథ్యమౌ అసుర పతికి
వైభవమడుగంటు ప్రభువు చేరుచునున్న
ఆ విభీషణుడిట్లు ఆశపడెను
ఎఏ పాదముల్ తాక ఇల రాయి స్త్రీ అయ్యె
ఎవ్వని దాసులు ఎనయు సుఖము

తే॥ ధన్యమేపాదముల్ చేసె దండక వని
నే పదము సీత ప్రేమతో ఎదను నిల్పె?
కపట లేడినే పాదాలు కాన దరిమె
అట్టి పదపద్మముల తాకి అనఘు డగుదు.



వ॥ ఏ చరణములు శివుని మానస సరోవరమున విహరించునో, ఏ చరణముల పాదుకలను భరతుడు మనసులో ధ్యానించునో, అట్టి చరణములను నేడు ప్రత్యక్షముగా చూడబోవు చున్నాను. అహా! నా భాగ్యమునే విధముగా వర్ణింపగలను. ఈ విధముగా యోచించుచూ ఆ విభీషణుడు రాముని కడకేగెను.

సీ॥ ఈ రీతి ప్రీతితో పరికించి ఆతండు
కడలిని దాటగా కపులు చూచి
శత్రు దూతగ తల్చి ఆత్రము చెందుచున్
అది చెప్ప రాజుకున్, అతడు ప్రభుతొ
రఘునాథ! వచ్చెను రావణు తమ్ముండు
తమరి చూచెదనంచు తగుచు అనియె,
రాజ! ఏమందువా రఘుపతి అడిగెను,
దనుజుల ప్రభు! నమ్మ తగదు, వారు

తే॥ మాయ రూపాలు మార్చెడి మాయ గాళ్ళు
జడుడు గోప్యము లెరుగనై చనియె నిటకు
వీని బంధించి యుంచుటే, వినుము మేలు
అనగ కపిచూచి రాముండు అనియె నిట్లు

తే॥ నేస్తమా మంచి నుడివితి నీతినిట్లు
కాని శరణమిచ్చు వ్రతము కలదు నాకు
హనుమ ఈ మాట విని హర్షమంది తలచె
తండ్రి శరణాగతుల కెల్ల దాశరధియె.



వ॥ శ్రీరామ ప్రభువు సుగ్రీవునితో నిట్లనెను. ఎవడైతే తన హితులు కారు అనే అనుమానంతో శరణాగతులను త్యజించునో వాడు నీచుడు, పాపి. వానిని చూచుటయే తడవుగా పాపమంటును.

సీ॥ కోటి విప్రుల చంపి కూల్చిన ఖలునైన
శరణన్న త్యజియింప, చేరి నన్ను
కోర నశించును కోటి జన్మల పాప
మదికాక, నను పాపి అరయబోడు
ఆ విభీషణుడును అతి దుష్టుడైనచో
ననుచేర వచ్చునా? నన్ను నమ్మి
నిర్మల హృదయుండె నే కోరు భక్తుండు,
మోసమన్నను నాకు దోసమగును

తే॥ వినుము ఒకవేళ రావణు వేగు అతడు
అయిన భయమేల, ఆ దనుజుని క్షణమున
అంత మొందింతు, శరణార్థి నెంతనైన
ప్రీతి రక్షింతు వానిని ప్రేమతోడ.

వ॥ కృపానిధియైన శ్రీరామచంద్రుడు ఇంకనూ నవ్వుతూ ఇట్లు చెప్పెను. అతడెట్లు వచ్చిననూ ఇచ్చటకు తీసుకుని రమ్ము. అపుడు అంగద హనుమ సమేతుడై సుగ్రీవుడు కృపాళువు శ్రీరామునకు జయమగు గాక అనుచూ పోయెను.



తే॥ ఆ విభీషణు తోడ్తెచ్చి ఆదరమున
కపులు ప్రభుకడ నిలిపిరి, కనులు పండ,
రామ లక్ష్మణులను చూచె అమల భక్తి
రెప్ప వాల్చక స్తబ్ధుడై అప్పుడతడు.

వ॥ ఆ విభీషణుడు నేలకు దిగి వచ్చిన ఆ నీలమేఘ శ్యాముడైన విష్ణు రూపుని చూస్తూ అట్లే నిలబడిపోయెను.

సీ॥ ఆజానుబాహుండు అరవింద నేత్రుండు
భయమును శరణన్న బాపువాడు
రంగున శ్యాముండు, సింగపు కటివాడు
మదనుడే మోహించు మన్మథుండు
ఆయతమ్మగు ఉరమ్మలరార చూడగన్
తనువు పులకరించ కనులు చెమరు
మనసు దిట్టము చేసి మధురముగా పల్కె
ప్రభు నేను రావణ భ్రాత నయ్య

తే॥ దీనరక్షకా జన్మచే దానవుడను
తామసంబైన దేహంబు దాల్చియుంటి
గుడ్లగూబలు చీకటి కోరునెట్లు
అట్లు పాపమే ప్రియమౌను అరయ నాకు.

వ॥ మీరు సుజనులని, భీరువుల కష్టములు తొలగించు ప్రభువులని విని మీ శరణార్థినై వచ్చి యుంటిని. ఓ రఘువీరా! పాహి! పాహి! శరణార్థుల బ్రోచు ప్రభూ నన్ను రక్షింపుము.

సీ॥ పల్కుచునీరీతి పడెను సాష్టాంగంబు
ప్రభువు హర్షముతోటి పైకి లేపె,
దీనుని వచనాలు మనసుకు ప్రియమయ్యె
అక్కునన్ చేర్చుచు అనుజు తోటి
భక్తు కూర్చొన బెట్టి, భయము తీరెడి రీతి
కుశలమా చెప్పు లంకేశ నీకు
దనుజులందున యుండి ధర్మమ్ము నీవెట్లు
పాటించు చుంటివి బాగుగాను

తే॥ నీతిమంతుడ వవినీతి నీకహితము
నరకమైననున్ దుష్టుల చేరి కెపుడు
బ్రహ్మ ఈకుండు సఖ నీకు, ప్రభువు అనగ
ఆ విభీషణుండిట్లనెన్ ఆర్తి తోడ.

వ॥ ఓ రఘునాథా! మీ చరణ కమల దర్శనము వలన నేనిప్పుడు కుశలమే. నన్ను మీ భక్తునిగా గ్రహించి దయ చూపినారు. అది నాకు చాలు. జీవుడు శోక ధామమయిన కామమును త్యజించి శ్రీరాముని ఎంతవరకు భజింపడో అంత దనుక వానికి శుభము కలుగదు. కలలో కూడా మనశ్శాంతి కలుగదు.

సీ॥ మద మోహ లోభంబు మత్సర దుర్గుణా
లెంత దాక మనసు చెంత నుండు
కోదండ రాముని కోరబోదు మనస్సు
అవనిలో ఈ మాట అగును నిజము,
ప్రభువు ప్రతాపమే భాస్కర తేజమై
దుర్గుణంబను రాత్రి నిర్గమించి
జీవుల మనసుల చీకట్లు పోగొట్టు,
చీకట్లె సుఖము ఉలూకములకు

తే॥ స్వామి! నీ పాదముల్ చూచి క్షేమముంటి
నేను నీచ స్వభావుడన్ దానవుడను
ఘనత చేయలేదే శుభకార్యములను
నాదు భయమెల్ల తీరెను నీదు కరుణ.

వ॥ మరియూ ఓ ప్రభూ మీకృపచే తాపత్రయముల బాధ నశించినది. ఎవ్వరి రూపము మునులకు కూడా ధ్యానమందునైనా గోచరించదో అట్టి ప్రభువే నన్ను కౌగిలించి దయ చూపినాడు. శ్రీరామా! కృపాసుఖనిధానా! బ్రహ్మ మహేశ్వరులు పూజించెడి నీ చరణ కమలములను స్వయంగా దర్శించితిని. ఆహా! ఏమి నా భాగ్యము. అనగా శ్రీరామ చంద్రుడిట్లనెను...

సీ॥ పార్వతి శంకరుల్, భక్త కాకభుశుండు
ఎరుగు నా నైజమ్ము మరల చెపుదు,
విశ్వ ద్రోహుండైన భీతి శరణువేడి
మోహము కపటమ్ము మోసములను
త్యజియించు వారలన్, సుజనుల చేసెదన్,
భవబంధములపైన పరగుచుండు
ప్రేమ త్రాడుగ పేని పెట్టు నా చరణాల
నెవడు? రాగ ద్వేష మెవడు వీడు?

తే॥ అట్టి సమదర్శి సుమతి నా ఆత్మ యందు
లోభి హృదయాన ధనము తీరుగను యుండు,
నిన్ను బోలు సజ్జనులు నాకున్న ప్రియులు
అట్టి వారి కొరకు తప్ప అవతరించ.

వ॥ సగుణ బ్రహ్మమును ఉపాసించువారు, సదా పరహిత కాంక్షలను, నీతినియమములపై దృఢముగా విశ్వాసమున్న వారును, బ్రాహ్మణులపై ప్రేమ కలవారును, నాకు ప్రాణముతో సమానము.

సీ॥ వినుము ఓ లంకేశ ఘన సద్గుణుడ వీవు
అత్యంత ఆప్తుడ వందుచేత,
విని రాముమాటలన్ వనచరు లొకటిగ
జయజయ ధ్వానముల్ చేయగాను
కర్ణపేయంబైన వర్ణన వినికూడ
దనుజుని మనసుకు తృప్తి లేక
ప్రభు పాదములు తాకి పలుమారు ప్రేమతో
మదినిండ ప్రభువుతో మనవి చేసె

తే॥ ఈ చరాచర జగతికి ఈవె రక్ష
స్వామి! శరణాగతత్రాణ! సాధు మదిని
ఎరుగు వాడవే విను నిన్ను ఎరిగినంత
పాత వాసనల్ నశియించె భక్తి చేత.

తే॥ స్వామి! శివునికే ప్రియమైన తమరి మీద
ఇమ్ము భక్తిని, రాముండు ఏవమస్తు
పలికి దీవించె, సాగరజలము తోడ
రాజ్యతిలకునిన్ చేయుచున్ రాముడనియె.

వ॥ నీకు కోరిక లేదు సరియే కానీ నా దర్శనము విఫలము కారాదు. అప్పుడు ఆకాశము నుండి పుష్ప వర్షము కురిసెను.

తే॥ రావణుని క్రోధమను యగ్ని రగులుచున్న
అతని వేదన చల్లార్చి అటుల బ్రోచె,
శివుడు దశకంఠు కిచ్చిన సిరులు అన్ని
ప్రభువు తృటిలోన ఒసగెను భక్తునకును.

సీ॥ ప్రభు భక్తి వీడుచున్ పరదేవతల గొల్చు
వాడు వాలములేని పశువు కాదె?
భక్తుల బ్రోచేటి ప్రభునైజ మెరుగుచు
వానరుల్ ముదమున మునిగి రపుడు
సర్వ హృదయవర్తి సర్వజ్ఞుడైన, దా
నవ వైరి నరుడైన దేవుడనియె
**సఖులార! లోతైన సంద్రము నేరీతి**
**దాటుట? జలచరుల్ దాటనీవు**

తే॥ ఆ విభీషణుండిట్లనెన్ **ఆర్త త్రాణ!**
**నీదు శరమొక్కటే కోటి నీరధులను**
**జాలు శోషింప, అయిననూ సాగరమును**
**కొలిచి వేడుట ధర్మము తలచి చూడ.**

వ॥ **ఓ ప్రభూ! సగరుల వంశజుడవు. నీకుల గురువే సాగరుడు. అతడే ఏదో ఉపాయము చెప్పును. దానిచే శ్రమలేకయే ఈ వానర భల్లూక సైన్యములు సాగరమును దాటగలవు.**

సీ॥ ఆ విభీషణుమాట ఆలించి ప్రభువనెన్
**మంచి ఆలోచన కాంచవలెను**
**దైవ సాయము యున్నదా లేద?** అది విని
అన్నతో కుపితుడై అనుజు డనియె
**విను ప్రభూ! దైవమున్ విశ్వసించెదరేల**
**భీరువుల్ సోమరుల్ జరుపు రీతి,**
**జలధిని శోషింపు శక్తినే చూపింపు**
అపుడు నవ్వి ప్రభువు అటులె చేతు

తే॥ ధీరతను వీడ బోకుము, చేరి జలధి
దర్భల పరచి కూర్చుండె తనర దీక్ష,
కనగ శత్రుల బలమును దనుజ ప్రభువు
వేగులను పంపె తన భ్రాత వెనుక నుండి.

వ॥ అట్లు వేగులుగా పంపబడిన రావణుని దూతలు విభీషణుని వెనుకనే కపట వానరుల రూపము దాల్చి స్వయముగా ప్రభువు లీలలు కాంచిరి. రాముని సుగుణములు వాని శరణాగత ప్రేమ చూచి వారి మనస్సులందు ప్రభువునే పొగడ సాగిరి.

సీ॥ ప్రభు కీర్తి ప్రేమతో భక్తి మదిని నింద
గానము చేసిరా దనుజు లపుడు,
కపట రూపము వీడ, కపి సేన గుర్తించి
సుగ్రీవు కడ తెచ్చె, చూచి అతడు
**అంగ భంగము చేయమన** కపుల్ మర్దింప
అర్థించి రాముపై ఆన బెట్టి
నాసిక చెవులను నరక వద్దని వేడ,
సౌమిత్రి పిలిపించి జాలి దలచి

తే॥ వారితో చెప్పె నవ్వుచున్ **ఓరి వినుడు,**
**పొమ్ము, రావణుకీ లేఖ ఇమ్ము అనుము**
**ఓయి కులనాశకా! దీని ఒక్క మారు**
**చదివి నీ బుద్ధి మానవో చత్తు వింక.**

వ॥ **సీతాదేవిని రామున కొప్పగింపుము లేనిచో నీ కాలము అంతమైనది** అని గ్రహింపుము.

సీ॥ ఆ లక్ష్మణుని పాదమంటి, రాముని కీర్తి
ధ్యానించి మరలిరా దానవులును,
ప్రణమిల్లు దనుజులన్ రావణుడడిగెను
**కుశలమా ఓ కుశా! నాశమందు**
**ఆ విభీషణుడెట్లు అటనుండె తెల్పుమా,**
**భాగ్యము లిడు లంక వదలె జడుడు**
**తిరుగలిన్ నశియించు పురుగు ధాన్యముతోడ**
**ఆ రీతి కపులతో అతడు మడియు**

తే॥ **కాల ప్రేరితుల్ కపిసేన కలదు ఎట్లు?**
**అడ్డు లేకున్న సాగర మసుర సేన**
**వారి భక్షించి యుండును, వణుకు సోద**
**రులును ఎట్లుండిరో విన తెలుపు మిపుడు.**

వ॥ **ఓ వేగులారా! మీరు వారిని కలిసినారా? లేక వారే నా సత్కీర్తి విని వెను తిరిగిరా? శత్రువులకు అసలు తేజస్సు బలము కలవా? ఏల తెలుపరు? మీరు బాగా చకితులుగా కనపడు చున్నారు. ఎందువలన?** అని అడిగెను. అప్పుడు దూత లిట్లనిరి.

సీ॥ **ఎట్లడిగిరొ దయన్ అట్లె కోపము వీడి**
**మేము చెప్పెడి మాట స్వామి! వినుము**
**ఆ విభీషణుకిచ్చి ఆరీతి శరణమ్ము**
**రాజ్యతిలకు చేసె రాఘవుండు,**
**అరులంచు గుర్తించ అంగ ఖండన శిక్ష**
**శరణన్న తప్పించె కరుణ వదలె,**
**రామదండును కోటి మోములున్ వర్ణించ**
**లేవు, బల్మికి సాటి లేరు ఎవరు**

తే॥ వివిధ వర్ణ భల్లూకముల్ వింత కపులు
భీకరపు మేను ముఖములున్ భీతి గొల్పు
అచట లంక కాల్చిన కోతి అల్పు దతని
మించు వీరులౌ సేనలో మెండు గలరు.

వ॥ వారు కఠోరులు, భయంకర యోధులు, లెక్కలేనన్ని ఏనుగుల బలము కలిగి అధిక సంఖ్యలో ఉన్నారు. వారి పేర్లు అనేకములు. నీలుడు, నలుడు, అంగదుడు, గదుడు వికటాస్యుడు, దధిముఖుడు, కేసరి, నిశఠుడు, శఠుడు, జాంబవంతుడు. వీరంతా అమిత పరాక్రమశాలురు.

సీ॥ కపిసేన ఁబలములో కపిరాజుతో సముల్
గణన సాధ్యము కాదు, కలరు కోట్లు
రామకృపా లబ్ధి తమ బలంబౌ గాన
ముల్లోకములు వారి ముందు తృణము,
సేనాపతుల్ పదునెనిమిది 'పద్మాలు'
ప్రతి ఒక్కడున్ మిమ్ము బల్మి గెలుచు,
రాము నాజ్ఞయె లేక రగిలెడి కోపమ్ము
భరియించి అని గోరి పరగినారు.

తే॥ నిండు జలచరుల్ గల వార్ధి నెండబెట్టి
దాని పర్వతముల నింపి దాటగలము
మట్టి కరిపేము మర్దించి కొట్టి అసురు
ననుచు వానరుల్ ప్రతినలన్ పూనినారు.

వ॥ స్వాభావికముగా ఆ వానరులు నిర్దయులు లంకానగరమునే మింగి వేయునట్లుగా గర్జించి ఘీంకరించుచున్నారు. స్వభావ సిద్ధముగా శూరులు. పైగా శ్రీరామచంద్రుడు నాయకుడు. ఇక రావణా! వారు కోటి యమములనైనా యుద్ధములో జయించగలరు.

సీ॥ రామ తేజము బల్మి సమముగా వర్ణింప
ఆదిశేషున కైన అలవి కాదు,
శరమొక్క దానిచే శతసాగరమ్ములన్
శోషింప చేసెడి శూరుడతడు,
నీతి పాటించెడి నీ భ్రాత యోచన్
దాల్చి సాగరు భక్తి కొల్చుచుండె,
దశ కంఠుడున్ నవ్వి దర్పాన నిట్లనెన్
కోతినేతది ఎంత గొప్ప తెలివి

తే॥ పిరికి అగుటచే సాగరు పోర లేక
ప్రార్థనలచేత కాలమ్ము వ్యర్థ పరచు,
ఆ విభీషణు యాచించు నట్టి జడుని
ఘనతనే పొగడగ నేల కాననయ్యె.

తే॥ ఆ విభీషణన్ మంత్రిగా ఎవడు జేయు
వాడు విజయమ్ము విభవమ్ము చూడగలడె?
అనుచు రావణుడన విని అపుడు దూత
స్వామి! సౌమిత్రి లేఖను చదువు మనియె.

వ॥ ప్రభూ! లక్ష్మణుడిచ్చిన ఈ లేఖ చదివిన మీ మనసు శాంతించు నని శుకుడు చెప్పగా తన మంత్రి కిచ్చి చదువమనెను. అతడు పైకి ఇట్లు చదివెను.

తే॥ వ్యర్థ భాషణ చేసెడి పరమ మూర్ఖ!
నీదు వంశపు నాశము నిశ్చయంబు
రామబాణాగ్ని శలభమై రగులు నిన్ను
ఆ త్రిమూర్తులే రక్షించి ఆపలేరు.

వ॥ అందుచేత దురభిమానము వదలి నీ సోదరుడు విభీషణుని వలె రామచరణ పంకజములు కోరు భ్రమరమగుము.

సీ॥ లక్ష్మణు లేఖను లంకేశుడటు చూచి
భయపడి నవ్వుచూ పలికె పైకి,
నేలబడిన వాడు నింగి తాకగ చూచు
మాదిరీ తాపసి వదరుబోతు,
దూత ఆ మాటతో నీతి వాక్యము పల్కె
సౌమిత్రి వాక్యముల్ సత్యమయ్య
రామ వైరము మాని రామ శరణు వేడి
సీత తిరిగి ఇచ్చి బ్రతుకుమయ్య.

తే॥ అపుడు దనుజుడు కాలితో అతని తన్నె
ఆ విభీషణు రీతిగా అతడు వెడలి
రామ చరణాల పైబడి రక్ష వేడె
ప్రభువు కృప పూర్వ రూపమ్ము బడసె నతడు.

వ॥ శివుడు ఇట్లనెను ఓ పార్వతీ! ఈ శుకుడు పూర్వ జన్మలో జ్ఞానియైన ఒక ముని. అగస్త్యుని శాపమున రాక్షసుడై తుదకు శ్రీరామచరణ స్పర్శచే మరల మునిగా మారి తన నిజ ఆశ్రమమున కేగెను.

తే॥ మూడు దినములు గడచినన్ జాడలేదు
స్వామి ప్రార్థనన్ వినలేదు సాగరుండు,
అలిగి రాముండు రోషాన పలికెనిట్లు
భయము లేక సాగరుడును బయటపడదు.

సీ॥ **తమ్ముడా! ఇటు తెమ్ము ధనువు అస్త్రమ్ములన్**
**ఆగ్నేయ అస్త్రాన అణతు జలధి,**
**ఘనముగ ఎండింతు కఠినాత్మునికి జాలి**
**నేర్వ సాధ్యమె కాదు నిశ్చయముగ,**
**మమతారహితు కేల మహిని జ్ఞానపు బోధ,**
**వైరాగ్యమున్ లోభి బడయగలడె?**
**ఏ రీతి కామునికింపౌను హరి కథల్**
**కోపినిగ్రహమును కోర గలడె?**

తే॥ **విను మివన్నియున్ బీడులో విత్తినటులె**
పలికి ఈ రీతి రాముండు కోల నెత్తె
సంతసించుచున్ సౌమిత్రి చెంత చేర
అగ్ని యస్త్రము సంధించె అసురవైరి.

తే॥ సాగరుని మదిన్ పొంగెను జ్వాలలపుడు
కాలిపోసాగె దీనతన్ జల చరులును,
అపుడు జలనిధి బ్రాహ్మణ రూపు దాల్చి
పసిడి పళ్ళెర మున మణుల్ పరచి తెచ్చె.

వ॥ (కాకభుశుండు ఈ విధంగా అంటున్నాడు....)
**ఓ ఖగేశా! వినుము కదలీ వృక్షమును నీటితో తడుపుచు కోటి ప్రయత్నములు చేసిననూకాక దానిని కోసినప్పుడే ఫలములనిచ్చును. అట్లే నీచుడు వినయముతో ఎన్ని ప్రార్థనలు చేసిననూ కరుగడు. భయపెట్టుట చేతనే మాట వినును.**

సీ॥ ప్రార్థించె భీతిల్లి పదమంటి జలనిధి
**కావుమా నా తప్పు దేవ అనెను.**
**ప్రభు! నీదు సృష్టియే పంచ భూతములన్ని**
**వేదాలు ఘోషించె విధిని చెప్పె**
**నిర్ణయించితి వీవె నీరధిగా నన్ను**
**నీరధి శోషింప గౌరవంబె?**
**నీ సైన్యములు దాట నీరధి శోషింప**
**సవ్యమనందువా జరుపు మటులె**

తే॥ **నీదు ఆజ్ఞ మీరుట కాదు వేద హితము**
**నీవు శిక్షించ నను నాకు అవును మేలు**
**ముదిత, పశువు, శూద్రుడు, డోలు, మూఢమతులు**
**అన్ని దెబ్బల కోర్తురు అవనియందు.**

వ॥ అతని అత్యంత వినయ పూర్వక వచనములు విని కృపాళువైన రామచంద్రుడు చిరునవ్వుతో ఇట్లనెను. **ప్రియ సఖుడా! ఈ వానర సైన్యము నిన్ను దాటు ఉపాయము తెల్పుము.** అప్పుడు సముద్రుడు ఇట్లు సమాధానము చెప్పెను....

సీ॥ **విను నీలుడు, నలుడు, వానర సోదరుల్**
**బాల్యాన ఋషియొక్క వరము పొందె**
**వారు నీ మహిమతో గిరి నీట వేసినన్**
**జలధిలో అదికూడ తేలగలదు,**
**హృదయ పూర్వకముగా అనుకూల పర్చెదన్**
**వారధి నిర్మించి వాసి గనుము.**
**ఆ బాణ మట్టులే ఆ ఉత్తరపు దిశన్**
**నివసించు పాపుల నిహతి చేయు**

తే॥ ననగ రాముండు సాగరు మనవి తీర్చె,
పొగడె ప్రభు బల శౌర్యముల్ సాగరుండు
కష్టపెట్టెడి దుష్టుల కథను చెప్పి
ప్రభుని పదమంటి జలనిధి పయనమయ్యె.

తే॥ సాగరుడు నిజ గృహమేగ జనవిభుండు
అతని ఉద్బోధ పాటించె నపుడె పూనె,
తులసి దాసుండు బుద్ధికి తోచినట్లు
పాప నాశమౌ ఈ కథ భక్తి జెప్పె.

వ॥ శ్రీరఘునాధుని గుణ గానము సుఖదాయకము, సందేహ నివారకము, విషాద నాశకరము, ఓ మూర్ఖ మానసమా! నీవు సాంసారిక ఆశామోహముల త్యజించి, సతతమూ ఆ భగవానుని గుణ గానము చేయుము. ఆదర పూర్వకమైన దాని శ్రవణమే అగాధ భవసాగరమును దాటించగల నౌక.

**కలియుగము నందలి సమస్త పాప నివారణమైన**
**శ్రీరామ చరిత మానసము నందలి**
**పంచమ సోపానమయిన**

## సుందర కాండము

**సమాప్తము**
**శుభం భూయాత్**

సర్వేజనా స్సుఖినోభవన్తు

శ్రీ సీతారామ కృపా కటాక్ష ప్రాప్తిరస్తు.

దోహా
పవనతనయ సంకట హరన
మంగళ మూరతి రూప
రామలఖన సీతాసహిత
హృదయ బసహు సుర భూప.